

డిగ్రీ పరీక్షల్లో ఇద్దరు డీబార్

వెంకటాచలం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలలో బుధవారం మధ్యాహ్నం జరిగిన డిగ్రీ ఐదవ సెమిస్టర్ పరీక్షలలో నెల్లూరు నగరంలోని జెనెక్స్ విజన్ డిగ్రీ కళాశాలలో ఇద్దరు విద్యార్థులు డీబార్ అయినట్లు వీఎస్‌యూ పరీక్షల నిర్వాహణాధికారిని డాక్టర్ ఆర్ మధుమతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలలో మొత్తం 4,604 మంది విద్యార్థులకుగాను 4,343 మంది హాజరు కాగా 261 మంది గైర్హాజరయ్యారు.





దివ్య వెలుగుల దీపావళి నేడే



రంగనాథస్వామి ఆలయంలో దీపావళి ప్రాకారోత్సవం

నెల్లూరు (సాంస్కృతికం), (ఆంధ్రజ్యోతి) : జిల్లా అంతటా గురువారం దీపావళి పండుగను ఘనంగా జరుపుకునేందుకు ప్రజలు సిద్ధమయ్యారు. దీపావళి అంటే దీపాల వరుస అని అర్థం. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా ఈ పండుగ జరుపుకుంటాం. అలాగే ఇంటిలోని ప్రతికూల శక్తులను తొలగించి.. నూతన వెలుగులను తీసుకు వచ్చే గొప్ప పండుగ. ఆరోగ్యం, సంతో షం కోరుకుంటూ బంధుమిత్ర సపరివారంగా జరుపుకునే పండుగ ఇది. ఈరోజు లక్ష్మీ దేవి, కుబేరుడిని పూజిస్తారు. సాయంత్రం ఇంటిలోను, ముగింట గుమ్మాల వద్ద దీపాలు వెలిగించి లక్ష్మీదేవిని ఆహ్వానిస్తారు. టపాకాయలు కాల్చి సంబరాలు చేసుకుంటారు. దీపావళి సందర్భంగా జిల్లాలోని వైష్ణవ ఆలయాల్లో పూజలు, సహస్ర దీపాలంకరణ సేవ జరగనున్నాయి. మార్వాడీలు బంగారు దుకాణాల్లో లక్ష్మీపూజ చేసి, తమ వ్యాపారాలకు సంబంధించి కొత్త పద్దు పుస్తకాలు తెరుస్తారు.

ఘనంగా నరక చతుర్దశి

జిల్లా వ్యాప్తంగా ప్రజలు బుధవారం నరక చతుర్దశి జరుపుకున్నారు. చి శ్రీకృష్ణ భగవానునికి పూజలు చేశారు. తల్పగిరి రంగనాథస్వామి ఆలయం లో సాయంత్రం ప్రాకారోత్సవం, అనంతరం నకరాసుర వధ వేడుకలు జరిగాయి. కార్యక్రమాలను ఆలయ చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, ధర్మకర్తలు, ఈవో ఆళ్ల శ్రీనివాసరెడ్డి, పర్యవేక్షించారు. దీపావళి పర్వదినం సందర్భంగా గురువారం ఉదయం 8 గంటలకు తిరుమంజనం, సాయంత్రం పేట ఉత్సవం జరగనున్నాయి.




స్కూల్లో వసతులపై సీఈవోకి ఫిర్యాదు

- మనుబోలు ఎంపీడీవో విచారణ

మనుబోలు, (ఆంధ్రజ్యోతి): స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో వసతులు సరిగా లేవంటూ ఓ అజ్ఞాత వ్యక్తి జడ్పీ సీఈవోకి మంగళవారం ఫిర్యాదు చేశారు. దీనిపై ఇన్‌చార్జి సీఈవో మోహన్‌రావు స్పం దించి విచారణ చేపట్టాలని ఎంపీడీవో జలజాక్షిని ఆదే శించారు. దీంతో ఆమె బుధవారం బాలికల ఉన్నత పాఠ శాలను తనిఖీ చేశారు. ముఖ్యంగా తాగునీటి సమస్య, మరుగుదొడ్లు, మూత్రశాలకు నీరు రాకపోవడం, బల్లలు లేకపోవడం వంటి సమస్యలను విద్యార్థినులు, ఉపాధ్యా యినులు ఎంపీడీవో దృష్టికి తీసుకువచ్చారు. నాబార్డు నిధులతో కొంతమేర నిర్మాణాలు చేసి నిలిపివేసి ఉన్నా యని తెలిపారు. తాగునీటి పైపులైను పగిలిపోవడంతో మంచినీటి సమస్య తలెత్తిందని గుర్తించారు. సమస్య లను నమోదు చేసుకుని ఉన్నతాధికారులకు నివేదిక పం పనున్నట్లు ఎంపీడీవో తెలిపారు. ఆమె వెంట మండల విద్యాశాఖాధికారి-2 రమేష్, కార్యదర్శి గరుడయ్య ఉన్నారు.







వెబ్‌సైట్‌లో ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితా

నెల్లూరు(విద్య), అక్టోబరు 30 (ఆంధ్ర జ్యోతి) : జిల్లాలోని మునిసిపల్ మేనేజ్ మెంట్‌లో పని చేస్తున్న స్కూల్ అసిస్టెంట్ల పదోన్నతుల సీనియారిటీ జాబితాను జిల్లా విద్యాశాఖ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉందని డీఈవో ఆర్ బాలాజీరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సంబంధిత యాజమాన్యాల్లో పనిచేసే ఉపాధ్యాయులు సీనియారిటీ జాబితాను పరిశీలించి శుక్రవారం సాయంత్రం 5 గంటలలోపు లిఖిత పూర్వకంగా అభ్యంతరాలు తెలియ చేయాలన్నారు. అభ్యంతరాలన్నీ పరిశీలించి సరిచేసిన తరువాత నవంబర్ 4న తుది జాబితా ప్రకటిస్తామని తెలిపారు.



ఉపాధి కార్యాలయంలో రేపు జాబ్‌మేళా

నెల్లూరు (స్టోన్‌హౌస్ పేట), (ఆంధ్రజ్యోతి): జిల్లా ఉపాధి కార్యాలయంలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని జిల్లా ఉపాధి అధికారి ఎం వినయ్‌కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ జాబ్ మేళాలో వీల్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌లో ఎన్‌ఏపీఎస్ అండ్ కంపెనీ ట్రైనీస్ 150 పోస్టులకు ఇంటర్వ్యూలు జరుగుతాయని, ఐటీఐ, ఇంటర్, డిగ్రీ, డిప్లమో విద్యార్హత, 18 నుంచి 25 ఏళ్ల వయసు కలిగిన వారు అర్హులన్నారు. మెడిక్ ఫైర్ ప్రైవేట్ లిమిటెడ్‌లో బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ 200 పోస్టులకు ఎంపికలు జరుగుతాయన్నారు. లైఫ్ స్టైల్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్‌లో అంప్రెంటీస్ ట్రైనీస్ 10 పోస్టులకు ఎంపికలు జరుగుతాయని, పదో తరగతి నుంచి డిగ్రీ వరకు విద్యార్హత కలిగి 18 నుంచి 28 ఏళ్ల వయసు కలిగిన యువకు లు హాజరు కావచ్చన్నారు. ముత్తూట్ ఫైనాన్స్ లిమిటెడ్‌లో సేల్స్ ఆఫీసర్ 10 పోస్టులకు ఏదైనా డిగ్రీ విద్యార్హత, 18 నుంచి 30 లోపు వయసున్న వారు అర్హులని తెలిపారు. శుక్రవారం ఉదయం 10.30 గంటలకు ఉపాధి కార్యాలయంలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని కోరారు.





పేల్చితే ఆనందం.. పేలితే ప్రమాదం!

● బాణసంచా కాల్చేటప్పుడు జాగ్రత్త సుమా!

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : దీపావళి వచ్చిందంటే చాలు పెద్దలు, పిల్లలకు భలే సరదా. వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ బాణసంచా కాల్చుతారు. తమ ఇంట్లో చీకటిని పారద్రోలి దివ్య వెలుగులు వెలగాలని కోరుకుంటూ ఇంటి వాకిళ్లలో కొవ్వొత్తులు, ప్రమిదలు వెలిగించుకుంటారు. పురుషులు పెద్ద శబ్దాలు వచ్చే టపాకాయలు కాల్చుతుంటే, మహిళలు, పిల్లలు రంగురంగుల పూలు విరజిల్లే కాకర ఒత్తులు, సురసురాలు, భూచక్రాలు, వెన్నముద్దలు, జడలు కాలుస్తుంటారు. అయితే టపాకాయలు కాల్చే సమయంలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా, మొరటుగా వ్యవహరించినా ప్రమాదాల బారిన పడే ముప్పు ఉంది.



● రసాయనాలు వాడకం..

ప్రస్తుతం తయారు చేస్తున్న టపాసులలో రసాయనాలు సైతం ఎక్కువగా వాడుతున్నారు. దీనివల్ల ఆరోగ్యంతోపాటు పర్యావరణానికి తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది. ఈ టపాసుల్లో పొటాషియం నైట్రేట్, పొటాషియం క్లోరైట్స్, పోటాషియం పర్ క్లోరేట్స్, చార్‌కోల్, సల్ఫర్, మ్యాంగనీస్, సోడియం ఆక్సలేట్స్, అల్యూమినియం, ఐరన్ డస్ట్ పౌడర్, స్ట్రాన్షియం నైట్రేట్, బేరియం నైట్రేట్ తదితర వెలుగులు విరజిమ్మే రసాయనాలు ఎక్కువగా ఉంటున్నాయి. రాకెట్లు, చిచ్చుబుడ్లు పేల్చినప్పుడు అందులోని పాలిక్లోరినేటెడ్ డై ఆక్సిన్స్, ఫూరాన్స్‌తోపాటు అనేక రకాల విష పదార్థాలు వాతావరణంలో కలుస్తాయి. వీటితోపాటు ఓజోన్ పొరను దెబ్బతీసే నైట్రోజన్ డై ఆక్సైడ్, సల్ఫర్ డై ఆక్సైడ్ విడుదలవుతాయి. అలాగే భార లోహాలైన లెడ్, ఐరన్, జింకు, కాపర్, మ్యాంగనీస్, కోబాల్ట్, నికెల్, క్రోమియం, కాడ్మియంలు వాతావరణంలో కలుస్తాయి. శబ్ధ, నీటి, నేల కాలుష్యం ఎక్కువగా ఉంటుంది. ఇది మనిషి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతాయి.


బాణసంచా కొనుగోలు చేస్తున్న నగరవాసులు

ఈ వ్యాధులు సంక్రమిస్తాయి

● కళ్ల మంటలు, ఊపిరితిత్తుల్లో నెమ్ము ● గొంతు వాపు, జలుబు, తల నొప్పి, చాతి బరువెక్కడం ● శ్వాసకోశ ఇబ్బందులు ● టపాసుల పొగ పీల్చిన పది, పదిహేను నిమిషాలలో సల్ఫర్ డై ఆక్సైడ్ ప్రభావం చూపుతుంది. ● మానసిక, నరాల సమస్యలు ● రక్త సంబంధిత వ్యాధులు ● గుండె జబ్బులు, కేన్సర్ కారక వ్యాధులు ● నిద్రలేమి, వినికిడి శక్తి తగ్గిపోవడం, హై బీపీ

ఈ జాగ్రత్తలు తీసుకోండి

- టపాసులు కాల్చేటప్పుడు శరీరానికి బిగుతుగా ఉండే దుస్తులతోపాటు, శిల్క్ దుస్తులు ధరించరాదు. కాటన్ దుస్తులు మాత్రమే ధరించాలి.
- పేలుడు పదార్థాలు కాల్చేటప్పుడు చిన్నారుల వద్దనే పెద్దలు ఉండాలి.
- సగం పేలిన టపాకాయల వద్దకు వెళ్లకూడదు, కొంత సమయం గడిచిన తరువాత వాటిని నీటిలో వేయడం లేదా ఇసుకతో కప్పి వేయాలి.
- ఇరుకుగా ఉండే నివాసాలు, పూరిగుడిసెల మధ్య టపాసులను పేల్చడం మంచిది కాదు.
- టపాకాయలు కాల్చేటప్పుడు నీరు, ఇసుకను దగ్గరగా ఉంచుకోవాలి.
- తారజువ్వలను నిలువుగా ఉంచి కాల్చాలి.
- చేతులతో పట్టుకుని టపాసులు కాల్చరాదు.
- ఇళ్లలో టపాసులను పిల్లలకు అందకుండా ఉంచాలి.
- పెట్రోలు బంకులు దగ్గరగా ఉన్నచోట టపాసులు కాల్చరాదు.
- టపాసుల ఒత్తులు కాలి సగానికి నిలిచినప్పుడు దగ్గరగా వెళ్లి ఊదడం వంటివి చేయరాదు.
- టపాసులను కాల్చేటప్పుడు మిగిలిన టపాసులను దగ్గరగా ఉంచుకోరాదు. ఎందుకంటే నిప్పురవ్వలు పడి అవి కూడా పేలే అవకాశం ఉంటుంది కాబట్టి.
- టపాసులకు సాంబ్రాణి కడ్డీలతో అంటించడం ఎంతో మేలు.
- టపాసులు కాల్చేటప్పుడు మూతికి గుడ్డ కట్టుకోవాలి.

నాటు మందు మిస్‌ఫైర్

● ముగ్గురికి తీవ్ర గాయాలు
● బాధితుల్లో ఒకరు నెల్లూరు వాసి
● కృత్తివెన్ను మండలం నిడమర్రులో ఘటన


సంఘటనలో తీవ్రగాయాలపాలైన శివ

కృత్తివెన్ను, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): నాటు మందు మిస్‌ఫైర్ అవ్వడంతో ముగ్గురు గాయపడిన ఘటన కృత్తివెన్ను మండలం నిడమర్రు దళితవాడలో బుధవారం జరిగింది. వివరాల్లోకి వెళితే... నెల్లూరు పట్టణానికి చెందిన శివ పిట్టలు కొట్టుకుంటూ జీవిస్తున్నాడు. చెరువుల వద్ద పిట్టలు కొట్టేందుకు నిడమర్రు వచ్చాడు. గ్రామానికి చెందిన కర్రి నాగమల్లేశ్వరరావు సాయంతో నడకుదిటి వెంకన్న ఇంటి వద్ద పిట్టలను కాల్చే మందును సిద్ధం చేసేపనిలో నిమగ్నమయ్యారు. పక్క ఇంట్లో ఉండే 3వ తరగతి విద్యార్థి కర్రి తేజ వీరు చేసే పని చూసేందుకు వెళ్లాడు. ఇంతలో వర్షం పడటంతో హడావుడిగా మందును ఇంట్లోకి తీసుకెళ్తుండగా, ప్రమాదవశాత్తు మందు ఉన్న గిన్నె రాయిపై పడి, మిస్ ఫైర్ అయ్యింది. దీంతో శివ, నాగమల్లేశ్వరరావు కాళ్లకు తీవ్ర గాయాలు అయ్యాయి. తేజ కూడా గాయపడ్డాడు. వీరిని మచిలీపట్నం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. శివ, నాగమల్లేశ్వరరావు పరిస్థితి విషమంగా ఉంది. ఘటనా స్థలాన్ని డీఎస్పీ అబ్దుల్ సుభాన్, తహసీల్దార్ సోమేశ్వరరావు, ఎస్సై పైడిబాబు పరిశీలించారు. క్లూస్ టీమ్‌లు పరిశీలించి వివరాలను సేకరించాయి.

నాటు బాంబు!

జరిగిన ప్రమాదంపై భిన్న కథనాలు వినిపిస్తున్నాయి. నాటు బాంబుల తయారీలో అజాగ్రత్త వల్లే ప్రమాదం జరిగినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. తెల్లారితే దీపావళి.. పందుల వేట కోసం రహస్యంగా నాటు బాంబులు తయారీ జరుగుతున్నట్లు స్థానికులు చెప్పుకుంటున్నారు. తయారు చేసిన మందులను ఇంట్లో భద్రపరిచే క్రమంలో ప్రమాదం జరిగినట్లు వస్తున్న పుకార్లకు, సంఘటనలో సంభవించిన తీవ్రత, క్షతగాత్రులకు అయిన గాయాలు మరింత బలం చేకూర్చుతున్నాయి. అయితే పోలీసులు మాత్రం దీపావళి మందులు తరలించే క్రమంలో ప్రమాదం జరిగిందని చెబుతున్నారు.

పెరుగుతున్న పొగాకు సాగు

విస్తీర్ణం పెంచవద్దంటున్న బోర్డు అధికారులు ● ప్రత్యామ్నాయ పంటల సాగుకు సూచన

కలిగిరి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకుబోర్డు పరిధిలో ఏటేటా పొగాకు సాగు పెరుగుతోంది. ఓ బ్యారన్‌కు సరపడా పంటను సాగుచేస్తే పెట్టుబడులు పోను గతేడాది రూ. ఐదు లక్షలపైగా ఆదాయం వచ్చింది. దీంతో ఈ ఏడాది సాగుకు అధికసంఖ్యలో రైతులు ముందుకు వస్తున్నారు. ఈ క్రమంలో పొగాకు సాగును తగ్గించి ప్రత్యామ్నాయ పంటలైన కంది, పెసర, శనగ తదితరాలను సాగుచేయాలని బోర్డు అధికారులు రైతులకు సూచిస్తున్నారు. అయితే పొగాకు సాగుకు అలవాటి పడిన రైతులు ప్రత్యామ్నాయ పంటలవైపు మొగ్గు చూపడానికి సుముఖత వ్యక్తం చేయడం లేదు. కరోనా అనంతరం పొగాకు సాగును ప్రపంచవ్యాప్తంగా పలుదేశాల్లో తగ్గించడంతో భారత్‌లో పొగాకు మార్కెట్‌కు డిమాండ్ ఏర్పడింది. కానీ ఈ ఏడాది బ్రెజిల్, టాంజానియా, జింబాంబ్వే తదితర దేశాల్లో తిరిగి పొగాకు సాగు మొదలు పెట్టారు. ఆయా దేశాల్లో పండిన పొగాకు అధిక నాణ్యతా ప్రమాణాలు కలిగి ఉండటంతో ఎక్కువ శాతం ఆయా దేశాల పొగాకుకే డిమాండ్ ఉంది. ఆ ప్రభావం భారత్ మార్కెట్‌పై పడుతుందని, తద్వారా ధరలు తగ్గే అవకాశముందని అధికారులు తెలిపారు. ఈ విషయాలన్నీ దృష్టిలో పెట్టుకొని పొగాకు సాగును తగ్గించాలని వారు పేర్కొన్నారు.


కలిగిరి పొగాకు బోర్డు పరిధిలో సాగు చేస్తున్న పొగాకు

పండుగను ప్రశాంతంగా జరుపుకోండి

● ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు క్రైం, (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజలకు, పోలీసు అధికారులు, సిబ్బందికి ఎస్పీ జీ కృష్ణకాంత్ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఈ పండుగ అందరి జీవితాల్లో కాంతులు నింపాలని ఆకాంక్షిస్తున్నానన్నారు. ముందు జాగ్రత్త చర్యలతో, ప్రశాంత వాతావరణంలో దీపావళి జరుపుకోవాలని, పిల్లలు బాణసంచా కాల్చేప్పుడు తల్లిదండ్రులు మరింత అప్రమత్తంగా ఉండాలని కోరారు. లైసెన్స్ కలిగిన దుకాణదారులు మాత్రమే బాణాసంచా విక్రయాలు చేయాలని, నిబంధనలకు విరుద్ధంగా టపాసులు నిల్వ ఉంచినా, విక్రయించినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

యూపీఐ పాలిమర్స్ పైపుల తయారీ ఫ్యాక్టరీలో చోరీ

● రూ.30 లక్షల విలువైన మిషనరీ పరికరాల మాయం
● గతంలోనూ రెండుసార్లు చోరీకి యత్నం

వెంకటాచలం, అక్టో బరు 30(ఆంధ్రజ్యోతి) : మండలంలోని సర్వేపల్లి సమీపంలో ఉన్న యూపీఐ పాలిమర్స్ పైపుల తయారీ ఫ్యాక్ట రీలో మంగళవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. గుర్తుతెలియని వ్యక్తులు మొహాలకు గుడ్డలు కట్టు కొని అర్ధరాత్రి ఫ్యాక్టరీలోకి ప్రవేశించి దాదాపు రూ.30లక్షల విలువ చేసే మిషనరీ పరికరాలను అపహరించుకెళ్లారు. ఈ దృశ్యాలు అన్ని ఫ్యాక్టరీలో ఉన్న సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి. అయితే గత రెండు నెలల వ్యవధిలో రెండు సార్లు ఇదే ఫ్యాక్టరీలోకి గుర్తుతెలియని వ్యక్తులు ప్రవేశించి చోరీకి యత్నించారు. దీనిపై గతంలోనే ఫ్యాక్టరీ యాజమాన్యం వెంకటాచలం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కానీ ఆ సమయంలో పోలీసులు పట్టించుకోలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గత రెండేళ్ల కిందట కూడా ఫ్యాక్టరీలో చోరీ జరగగా అప్పట్లోనే దొంగలు పట్టుబడ్డారు. అయితే మంగళవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు మొహాలకు గుడ్డలు కట్టుకొని ఫ్యాక్టరీలోకి ప్రవేశించి చోరీకి పాల్పడ్డారు. దీంతో ఫ్యాక్టరీ యాజమాన్యం బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ సుబ్బారావు, ఎస్‌ఐ అంజనేయులు ఫ్యాక్టరీ వద్దకు చేరుకొని చోరీ జరిగిన తీరు, సీసీ కెమెరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కుష్ఠును ప్రారంభంలో గుర్తిస్తే వైకల్యం రాదు

● అదనపు జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వలి

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : కుష్ఠువ్యాధిని మొదటి దశలోనే గుర్తిస్తే అంగవైకల్యాన్ని అరికట్టవచ్చని వైద్య ఆరోగ్య శాఖ అదనపు జిల్లా అధికారి డాక్టర్ ఖాదర్‌వలి వెల్లడించారు. వైద్య ఆరోగ్యశాఖ కార్యాల యంలో బుధవారం డిప్యూటీ పారామెడికల్ అధికారులతో సమీక్ష జరిపారు. ప్రస్తుతం కుష్ఠువ్యాధి నివారణకు ఎన్నో రకాల మందులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. వైద్యాధికారి డాక్టర్ సురేంద్ర మాట్లాడుతూ కుష్ఠు వ్యాధిగ్రస్తుల వివరాలు ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందుబాటులో ఉండాలని సూ చించారు. వైద్యాధికారి డాక్టర్ సునీత్ మాట్లాడుతూ కుష్ఠువ్యాధి స్పర్శ లేని రాగి రంగు మచ్చలతో వస్తుందని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో డీపీఎంవోలు, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్డీవో కార్యాలయ ఉద్యోగిపై వేటు

● బాణసంచా దుకాణాల లైసెన్సులపై ఆరోపణలు
● సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు


నెల్లూరు (వెంకటేశ్వరపురం), అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు ఆర్డీవో కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న జూనియర్ అసిస్టెంట్ శ్రావణ్ కుమార్‌ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఆనంద్ బుధవారం ఉత్తర్వులు ఇచ్చారు. టపాసుల దుకాణాల లైసెన్సుల రెన్యువల్‌లో జాప్యంతోపాటు దుకాణాలను కేటాయించే డిప్‌లో సైతం గందరగోళ పరిస్థితులు నెలకొనడంపై ఈ చర్యలు తీసుకొన్నట్లు ఆర్డీవో అనూష తెలిపారు. వీటితోపాటు పలు ఆరోపణలు రావడంతో సస్పెండ్ చేసినట్లు పేర్కొన్నారు.

ఈశా ఫౌండేషన్ గ్రామోత్సవాలు

● జిల్లాలో క్రీడల నిర్వహణకు ఏర్పాట్లు


వివరాలు వెల్లడిస్తున్న ఈశా ఫౌండేషన్ సభ్యులు

నెల్లూరు(విద్య), అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఈశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లాలో గ్రామోత్సవాలు నిర్వహిస్తున్నామని ఫౌండేషన్ ప్రతినిధి బ్రహ్మానాయుడు తెలిపారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రామీణ స్ఫూర్తిని పునరు జ్జీవింప చేసేందుకు, పల్లె ప్రజల్లో ఉత్సాహం నింపేందుకు గ్రామోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. దీనిలో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు ఈనెల 16, 17 తేదీల్లో నెల్లూరులోని దర్గామిట్ట జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో క్రీడాపోటీలు జరుపుతామని చెప్పారు. పంచాయతీల నుంచి ఎన్ని జట్లు అయినా ఈ పోటీల్లో పాల్గొనవచ్చని, విజేతలకు నగదు బహు మతులు, ప్రసంశాపత్రాలు అందచేస్తామన్నారు. జిల్లాస్థాయిలో గెలుపొందిన జట్లు రాష్ట్రస్థాయిలో, రాష్ట్రస్థాయిలో గెలుపొందిన వారు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు. ఆసక్తి కలిగిన వారు నవంబరు 10లోపు వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ఈశా ఫౌండేషన్ వలంటీర్లు గణేష్, ఆయేషా, మాధవ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



టీటీడీ పాలక మండలి సభ్యులుగా ప్రశాంతి, పనబాక

● ఉత్తర్వుల జారీ చేసిన కూటమి ప్రభుత్వం



ప్రశాంతిరెడ్డికి మిఠాయి అందజేస్తున్న కేతంరెడ్డి

నెల్లూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) పాలక మండలి సభ్యులుగా ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి నియమితులయ్యారు. ఈ మేరకు కూటమి ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో టీటీడీ ఢిల్లీ స్థానిక సలహా మండలి చైర్‌పర్సన్‌గా వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సేవలందించారు. ఇప్పుడు పాలకమండలిలో చోటు దక్కించుకున్నారు. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి సతీమణిగా ప్రశాంతి రెడ్డి వీపీఆర్ ట్రస్టు ద్వారా పలు ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలను నిర్వహించారు. నెల్లూరులో రెండు పర్యాయాలు శ్రీ వేంకటేశ్వరస్వామి వైభవోత్సవాలను నిర్వహించారు. అనేక దేవాలయాల పునరుద్ధరణకు వీపీఆర్ దంపతులు భారీగా విరాళాలు అందజేశారు. ఆధ్యాత్మిక, ధార్మిక కార్యక్రమాల్లో వీపీఆర్ దంపతులు చేస్తున్న సేవలను గుర్తించి టీటీడీలో ప్రశాంతిరెడ్డికి రెండవ సారి అవకాశం కల్పించారు.



పనబాక లక్ష్మి

● ఇక సీనియర్ రాజకీయ నాయకురాలు పనబాక లక్ష్మి తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో తొలిసారిగా టీటీడీలో పదవిని పొందారు. 1996 నుంచి నెల్లూరు ఎంపీగా మూడుసార్లు, బాపట్ల ఎంపీగా ఒకసారి లక్ష్మి గెలుపొందారు. 2004-09లో కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రిగా, 2009-14లో టెక్స్‌టైల్స్, పెట్రోలియం శాఖ మంత్రిగా పనిచేశారు. 2019లో తెలుగుదేశం పార్టీలో చేరారు. 2019, 2021 ఎన్నికల్లో తిరుపతి పార్లమెంట్ స్థానం నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేశారు. ఇంత సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఆమె ఏనాడు టీటీడీ పాలకమండలిలో పని చేయలేదు. తొలిసారిగా ఇప్పుడు సభ్యురాలిగా నియమితులయ్యారు.

నమ్మకం నిలబెట్టుకుంటా : ప్రశాంతి

మా ఆరాధ్య దైవం తిరుమల శ్రీనివాసుడి సన్నిధిలో భక్తులకు సేవ చేసే భాగ్యం కల్పించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలుపుతున్నా. సీఎం నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటా. టీటీడీ విశిష్టతను కాపాడేలా సేవా భావంతో పని చేస్తా. శ్రీవారి భక్తుల సేవలో తరిస్తాను. అభివృద్ధి, సేవా కార్యక్రమాలతో కోవూరు నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకుంటాను.

● అభిమానుల సంబరాలు

టీటీడీ బోర్డు సభ్యురాలిగా వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి నియామకం సందర్భంగా గురువారం రాత్రి నెల్లూరులోని వీపీఆర్ నివాసం వద్ద అభిమానులు సంబరాలు చేసుకున్నారు. వీపీఆర్ యువసేన నాయకుడు కేతంరెడ్డి వినోద్‌రెడ్డి, ఆయన అనుచరులు బాణసంచా పేల్చి, స్వీట్లు పంచిపెట్టారు. ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిని ఘనంగా సన్మానించారు.

నవంబరు 2న డీఆర్సీ సమావేశం

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : నవంబరు 2వ తేదీన జిల్లా రివ్యూ కమిటీ (డీఆర్సీ) సమావేశం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎన్ఎండీ ఫరూఖ్‌తోపాలు జిల్లాకు చెందిన రాష్ట్ర మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణ ఎమ్మెల్యేలు ప్రజాప్రతినిధులు పాల్గొంటారని పేర్కొన్నారు. శనివారం మధ్యాహ్నం 2.30 గంటలకు జడ్పీ సమవేశ మందిరంలో జరిగే సమావేశానికి వివిధ శాఖల అధికారులు సమగ్ర సమాచారంతో రావాలని ఆదేశించారు.

సాగునీటి విడుదల ప్రారంభం

- ఐఏబీ ఆలస్యంతో అధికారుల నిర్ణయం
- పూర్తి ఆయకట్టుకు నీటిపారుదల
- పది వేల ఎకరాలకు ఒక టీఎంసీ చొప్పున కేటాయింపు
- సోమశిల కింద 5.51 లక్షల ఎకరాలు, కండలేరు పరిధిలో 2.26 లక్షల ఎకరాలు సాగులోకి



నెల్లూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : కీలకమైన రబీ సీజన్‌కు అవసరమైన సాగునీటిని విడుదల చేయాలని జిల్లా ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు బుధవారం సోమశిల, కండలేరు నుంచి నీటి విడుదల ప్రారంభించారు. సాగునీటి సలహా మండలి(ఐఏబీ) ఆలస్యమవుతుండడంతో ఈలోపు రైతులకు ఇబ్బందులు లేకుండా ఉన్నతాధికారులు మంత్రులు, ఎమ్మెల్యేలతో చర్చించారు. ముందు నార్లు పోసుకునేందుకు వీలుగా నీటి విడుదల చేయాలని సమష్టి నిర్ణయం తీసుకున్నారు. సోమశిల, కండలేరు జలాశయాల్లో పుష్కలంగా నీరు అందుబాటులో ఉండటంతో ఈదఫా ఉమ్మడి నెల్లూరు జిల్లాలో పూర్తి ఆయకట్టుకు నీరందించేందుకు నిర్ణయించారు. సోమశిల కింద 5.51 లక్షల ఎకరాలకు నీరందించేలా తీర్మానించుకున్నారు. పెన్నార్ డెల్టాలో 2.47 లక్షల ఎకరాలు, కనుపూరు కాలువ కింద 66 వేలు, కావలి కాలువ కింద 1.24 లక్షల ఎకరాలు, ఉత్తర కాలువ కింద 72 వేలు, దక్షిణ కాలువ కింద 42 వేల ఎకరాలకు నీరిందించనున్నారు. పది వేల ఎకరాలకు ఒక టీఎంసీ చొప్పున 5.51 లక్షల ఎకరాలకు 55.100 టీఎంసీల నీటిని రబీ సాగుకు కేటాయించారు. బుధవారం నుంచి నార్లు పోసుకునేందుకు సోమశిల నుంచి 2900 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. కనిగిరి కెనాల్‌కు 500 క్యూసెక్కులు, సర్వేపల్లి కాలువలకు 600 క్యూసెక్కులు, కనుపూరు కాలువకు 500, కావలి కాలువకు 500, ఉత్తర కాలువకు 500, దక్షిణ కాలువకు 300 క్యూసెక్కుల చొప్పున నవంబరు 19వ తేదీ వరకు విడుదల చేయాలని అధికారులు నిర్ణయం తీసుకున్నారు. అలానే కండలేరు ప్రాజెక్టు కింద కూడా ఈదఫా పూర్తి ఆయకట్టుకు సాగునీరు అందించాలని నిర్ణయించారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాతోపాటు ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో కలిపి 2.26 లక్షల ఎకరాలకు సాగునీరు అందించనున్నారు. ఇందుకుగానూ 22.60 టీఎంసీలను కేటాయించారు. కండలేరు కింద నార్లు పోసుకునేందుకు నవంబరు 13వతేదీ వరకూ రోజూ 1,945 క్యూసెక్కులను విడుదల చేయాలని నిర్ణయించారు. త్వరలోనే ఐఏబీ సమావేశం నిర్వహించి ఈ కేటాయింపులను అధికారికంగా ఆమోదించనున్నారు. కాగా ఈ నీటి విడుదలపై రెగ్యులర్ ఇరిగేషన్ ఇన్‌చార్జ్ ఎస్ఈ దేశ్‌నాయక్, టీజీపీ ఇన్‌చార్జ్ ఎస్ఈ రమణారెడ్డిలు 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ ప్రాజెక్టుల్లో పుష్కలంగా నీరు ఉన్న తరుణంలో ఈదఫా అన్ని కాలువల కింద పూర్తి ఆయకట్టుకు నీరందించేందుకు మంత్రులు, ఎమ్మెల్యేలు, కలెక్టర్‌తో చర్చించి సమష్టి నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు.

సోమశిల డ్యాంలో 67.751 టీఎంసీల నిల్వ

అనంతసాగరం (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి 21,808 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. డ్యాం పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా 67.751 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ డెల్టాకు 50, కండలేరుకు 10,000, ఉత్తరకాలువకు 300 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

● సంగం బ్యారేజ్ నుంచి నీటి విడుదల

సంగం (ఆంధ్రజ్యోతి): స్థానిక సంగం బ్యారేజ్ నుంచి కాలువలకు బుధవారం నీటిని విడుదల చేశారు. కనిగిరి ప్రధాన కాలువకు 500 క్యూసెక్కులు, నెల్లూరు ఆనకట్టకు 600, కనుపూరు కాలువకు 500 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేశారు. వచ్చే నెల 20వ తేదీ వరకు ఈ నీటి విడుదల ఉంటుందని అధికారులు తెలిపారు. అదేవిధంగా కావలి (బీపీఈఆర్) కాలువకు వచ్చే నెల 13 తేదీ వరకు 500 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు.

4 లక్షల మందికి ఉచిత గ్యాస్

- ప్రతి నాలుగు నెలలకు ఒక సిలిండర్
- సమస్యల పరిష్కారానికి టోల్ ఫ్రీ నెంబర్
- విలేకరుల సమావేశంలో కలెక్టర్



నెల్లూరు (హరనాథపురం), అక్టోబరు 30 : జిల్లాలో 4,06,522 మంది వినియోగదారులు ఉచిత గ్యాస్ సిలిండర్లకు అర్హులని కలెక్టర్ ఆనంద్ వెల్లడించారు. బుధవారం కలెక్టరేట్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ దీపం-2 పథకం కింద నవంబరు 1వ తేదీ నుంచి ప్రభుత్వం ఉచిత గ్యాస్ సిలిండర్లను అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతి నాలుగు నెలలకు ఒకసారి ఈ ఉచిత సిలిండర్ అందచేయటం జరుగుతుందన్నారు. సిలిండర్ పొందిన 48 గంటలలో లబ్ధిదారులకు డీబీటీ ద్వారా ప్రభుత్వం సబ్సిడీని వారి ఖాతాల్లో జమచేస్తుందని చెప్పారు. 1న నియోజకవర్గాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు ఈ ఉచిత సిలిండర్‌ను పంపిణీ చేస్తారని చెప్పారు. దీపం కింద 2,33,398 మంది, ఉజ్వల పథకం కింద 24,318 మంది, సీఎస్ఆర్‌లో 1,00,208 మందికి గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయని చెప్పారు. ఉచిత సిలిండర్ పొందేందుకు ఏమైనా సమస్యలు ఉంటే 1967 టోల్ ఫ్రీం నెంబరుకు ఫిర్యాదు చేయాలని కోరారు. ఉచిత సిలిండర్ల కోసం ఏవిధమైన దరఖాస్తు చేయాల్సిన పనిలేదన్నారు. సాధారణ గ్యాస్ బుకింగ్ మాదిరిగానే ఉచిత సిలిండర్‌ను బుక్ చేసుకోవాలన్నారు. క్రియాశీలకంగా ఉన్న ఎల్‌పీజీ కనెక్షన్లు, ఆధార్ నంబరు అనుసంధానం, తెల్లరేషన్ కార్డు , ఇతర శాఖ డేటాబేస్‌తో సరిపోలిన ఎల్‌పీజీ కనెక్షన్ ఉన్నవారికి ఈ పథకం వర్తిస్తుందన్నారు. అర్హులైన లబ్ధిదారులకు ఫోన్ ద్వారా సమాచారం అందించటం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో డీఎస్ఓ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

'కండలేరు' నుంచి నీటి విడుదల



రాపూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : సైదాపురం, గూడూరు మండలాల్లో సాగునీటి అవసరాల కోసం కండలేరు జలాశయం నుంచి 50 క్యూసెక్కుల నీటిని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ బుధవారం నీటిని విడుదల చేశారు. అంతకుముందు డ్యాం వద్ద ఆయన పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కండలేరు జలాలు అటు తమిళనాడు, ఇటు మూడు జిల్లాల ప్రజల సాగు, తాగునీటి అవసరాలకు ఉపయోగపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో టడీపీ మండల అధ్యక్షుడు కోటినాయుడు, రాఘవరెడ్డి, మాజీ సర్పంచ్ పచ్చిగల్ల రత్నం, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



బుచ్చిలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న ఓ లేఅవుట్‌కు పెన్నానది తీరం నుంచి తవట మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్లు

ఉచిత ఇసుక పాలసీ పక్కదారి!

- అక్రమార్కులు, అధికారులకు కాసుల వర్షం
- శాండ్ పేరుతో లేఅవుట్లకు తవటమట్టి తరలింపు

బుచ్చిరెడ్డిపాళెం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఉచితంగా ఇసుక అందించాలన్న ప్రభుత్వ ఆశయం పక్కదారి పడుతోంది. ఉచితం మాటున అక్రమాలకు పాల్పడుతున్న కొందరు అధికారులు, అక్రమార్కులకు కాసుల వర్షం కురిపిస్తోంది. ఉచిత ఇసుకతో భవనాలు, ఇళ్ల తదితర నిర్మాణాల సంగతేమోగానీ పెన్నానది నుంచి ఇసుక ముసుగులో మట్టి తోలకందారులు బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీతోపాటు మండలంలోని కొన్ని లేఅవుట్లకు పెన్నానదిలో నుంచి నిత్యం వందలకొద్దీ ట్రిప్పుల లారీలతో తవట మట్టిని తరలిస్తున్నారు. ఈ విషయంపై ప్రజలు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదనే ఆరోపణలున్నాయి.



వెంకన్నపాళెంలో రైతులకు సుడోమోనాస్ ప్యాకెట్లు అందజేస్తున్న డీఏవో సత్యవాణి

సమృద్ధిగా విత్తనాలు, ఎరువులు

● 1250 ఎకరాలకు ఒక వీఏఏ : డీఏవో

మనుబోలు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌కు సరిపడా జిల్లాలో విత్తనాలు, ఎరువులు సంవృద్ధిగా ఉన్నాయని జిల్లా వ్యవసాయాధి కారిణి సత్యవాణి పేర్కొ న్నారు. మండలంలోని వెంకన్నపాళెం లో ఉన్న రైతుసేవా కేంద్రంలో బుధవారం నిర్వ హించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లా డారు. జిల్లాలో మూడు రకాల వరి విత్తనాలు 11వేల 500 క్వింటాళ్లు, 16వేల మెట్రిక్ టన్నుల యూరియా, ఇతర కాంప్లెక్స్ ఎరువులు 40వేల మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నాయన్నారు. వీఏఏల రేషనలైజేషన్ జరుగనుందని, 1250 ఎకరాలకు ఒక వీఏఏను నియమించనున్నారన్నారు. ప్రభుత్వం ఆమోదం వచ్చాక జిల్లాలో ఎక్కడా వీఏఏల కొరత ఉండదన్నారు. రైతుసేవాకేంద్రాల ద్వారా సొసైటీలకే కాకుండా అవసరమైన చోట్ల ఎరువుల పంపిణీ చేస్తామన్నారు. ఈ ఏడాది జిల్లాలో 5 లక్షల ఎకరాలకు పైగా సాగునీటిని విడుదల చేస్తున్నందున అంతే స్థాయిలో పంటలు సాగు చేస్తారని అంచనా వేస్తున్నామన్నారు. రైతుసేవాకేంద్రాల అద్దెలు, కరెంటు బిల్లులు బకాయిలు లేవన్నారు. వరికి విలేజ్ యూనిట్‌గా తీసుకుని పంట నష్టపరిహారం ఇవ్వనున్నారని, దీనికోసం రైతు ఎకరాకు రూ.148 చెల్లించి ఇన్సూరెన్స్ చేసుకోవాలన్నారు. ప్రకృతి వైపరీత్యాల ద్వారా పంట దెబ్బతిన్నా, దిగుబడి తగ్గినా గ్రామంను యూనిట్‌గా తీసుకుని నష్టపరిహారం రూ.42వేలు వస్తుందన్నారు. నానా యూరియాను వాడుకోవచ్చునన్నారు. అనంతరం ఆమె రైతులకు సుడోమోనాస్ ప్యాకెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏడీఏలు నర్సోజీరావు, శివనాయక్, ఏవో జహీర్, ఏఈవో కళారాణి తదితరులు పాల్గొన్నారు.



కేసు వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీధర్ , పక్కన పోలీసు అధికారులు

చిన్నారి కిడ్నాప్ కేసులో నలుగురి అరెస్టు

● రూ.1.10 లక్షలకు విక్రయించిన నిందితురాలు

కావలి,అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వెంగళరావునగర్‌లో తేజ (14 నెలలు) అనే చిన్నారిని కిడ్నాప్ చేసిన కేసులో నలుగురు నిందితులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ పీ. శ్రీధర్ తెలిపారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో రెండోపట్టణ సీఐ గిరి బాబుతో కలిసి బుధవారం ఆయన కేసు వివరాలను వెల్లడించారు. వెంగళరావు నగర్‌కు చెందిన పల్లపు రాజేశ్వరి సోమవారం మధ్యాహ్నం తన కుమారుడు తేజను ఇంట్లో ఊయలలో నిద్రపుచ్చి స్నానానికి వెళ్లి వచ్చేలోపు మాయమయ్యాడు. దీంతో ఆమె రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కిడ్నాప్ కేసు నమోదు చేశారు. దీంతో కావలి, నెల్లూరు రూరల్, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీల పర్యవేక్షణలో దర్యాప్తు కోసం కావలి వన్‌టౌన్, టూటౌన్, రూరల్, సర్కిల్ సీఐలు, ఎస్ఐలతో నాలుగు టీమ్‌లను ఏర్పాటు చేశారు. దర్యాప్తులో పట్టణంలోని నార్త్ జనతాపేటకు చెందిన శెట్టిపల్లి స్వరూప ఆ చిన్నారిని అపహరించి ఏఎస్‌పేట మండలం పొనుగోడుకు చెందిన గంగవరపు ఉపేంద్రకు రూ.1,10,000లకు విక్రయిం చినట్లు వెల్లడైంది. ఉపేంద్ర సోదరుడికి పిల్లలు లేక పోవటంతో ఎవరైనా దత్తత ఇచ్చే వారు ఉంటే చూడమని చెప్పాడు. దాన్ని ఆసరాగా చేసుకుని తనకు పరిచయం ఉన్న ఉపేంద్రకు స్వరూప ఆ బిడ్డను విక్రయించింది. దీంతో వారిద్దరూ కారు మాట్లాడుకుని డ్రైవర్ షేక్ నజీమ్, ఆయనకు సహాయకుడిగా పెరణంపాటి అశోక్‌తో కలిసి కారులో ఉపేంద్ర అన్న ఉంటున్న మార్కాపురానికి మంగళవారం బయలు దేరారు. దీంతో ఆమె ఫోన్ నెంబరు ఆధారంగా వారిని గుర్తించి కందుకూరు నియోజకవర్గ పరిసరాల్లో కారును పట్టుకున్నారు. అందులో ఉన్న నలుగురి అదుపులోకి తీసుకుని విచారించగా వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. దీంతో ఆ చిన్నారితో పాటు ఆ నలుగురి నిందితులను కావలికి తీసుకువచ్చారు. ఆ చిన్నారని మంగళవారం రాత్రే తల్లితండ్రులకు అప్పగించారు. నలుగురు నిందితులను బుధవారం ఉదయం కోర్టుకు హాజరుపరిచామని డీఎస్పీ వివరించారు.

పోలినేనిపాలెంలో ట్రాన్స్‌ఫార్మర్ పరిశీలన

వలేటివారిపాలెం, అక్టోబరు 30: మండలంలోని పోలినేనిపాలెం ఎస్సీ కాలనీ మధ్యలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను బుధవారం ఏఈ తాటికొండ మధుబాబు పరిశీలించారు. ట్రాన్స్‌ఫార్మర్ నుంచి భూమిలోకి వెళ్లే ఎర్త్‌వైరుకు మూడు నెలల నుంచి విద్యుత్ సరఫరా అవుతున్నట్లు కాలనీవాసులు తెలిపారు. దీంతో అది ప్రమాదకరంగా ఉందని తెలిపారు. త్వరితగతిన సమస్యను పరిష్కరిస్తానని ఏఈ తెలిపారు.

కావలిలో అన్న క్యాంటీన్ తనిఖీ

కావలి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని అన్న క్యాంటీన్‌లో ఆహారంలో నాణ్యత లోపిస్తోందని వస్తోన్న ఫిర్యాదుల మేరకు బుధవారం మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్‌కుమార్ ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఉదయం టిఫిన్ రుచి చూడగా చట్నీ వాసన వస్తుండటంతో నిర్వాహకులను హెచ్చరించారు. మధ్యాహ్నబోజనంలో కూడా కూరలు బాగా ఉండటంలేదనే ఆరోపణలతో ఆహారం సరఫరా చేసే కాంట్రాక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. అక్కడ మున్సిపల్ పర్యవేక్షకుడిగా ఉన్న ఉద్యోగిని ఇలాంటి సమాచారం తన దృష్టికి ఎందుకు తీసుకు రాలేదని ఆగ్రహించారు. వివరాలు తెలియచేయకుండా చర్యలు తప్పవన్నారు.

సెల్ఫీ పాయింట్‌తో వినోదం.. విజ్ఞానం : ఆనం


విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి ఆనం

కావలి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): 'ఐ లవ్ యూ కావలి' అంటూ వందఅడుగుల ఎత్తు జాతీయ జెండాతోపాటు ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్ వినోదంతోపాటు విజ్ఞానం కూడా పెంపొందిస్తోందని రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. బుధవారం సాయంత్రం ఆయన కావలిలోని 100 అడుగుల జాతీయ జెండా సెల్ఫీ పాయింట్‌ను సందర్శించి, నేతలతో కలిసి కొద్దిసేపు సందడి చేశారు. సెల్ఫీ పాయింట్ వద్ద జాతీయ జెండాతోపాటు ఇప్పటివరకు పనిచేసిన కావలి ఎమ్మెల్యేల, జాతీయ నేతల చిత్రాలను పరిశీలించారు. అనంతరం టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులను ఎమ్మెల్యే దగుమాటి కృష్ణారెడ్డి మంత్రికి పరిచయం చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ క్రిష్ణారెడ్డి తనకు చిరకాల మిత్రుడని, ఆయన ఎంపీపీగా పోటీచేసినపుడు ఎమ్మెల్యేగా తాను ఆయన విజయానికి కృషి చేశానన్నారు. ఈ సందర్భంగా మంత్రికి ఆర్డీవో వంశీక్రిష్ణ, డీఎస్పీ శ్రీదర్, మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్ తదితరులు కలిసి పుష్పగుచ్ఛాలు అందచేశారు.

రామాలయంలో హుండీ చోరీ

లింగసముద్రం, (ఆంధ్రజ్యోతి) : స్థానిక కోదండరామాలయంలో మంగళవారం అర్ధరాత్రి గ్రిల్స్‌కు వేసిన తాళాన్ని దుండగులు పగులగొట్టి హుండీని ఎత్తుకెళ్లారు. మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు దేవకి శేషారావు ఈ విషయమై బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.కేసు దర్యాప్తులో ఉంది.



కలిగిరిలో భారీ వర్షం

కలిగిరి, అక్టోబరు 30: పట్టణంలో బుధవారం మధ్యాహ్నం సుమారు గంటసేపు భారీ వర్షం కురిసింది. మబ్బులు లేకుండా ఉరుములు, మెరుపులతో ఒక్కసారి గా వర్షం పడటంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. రోడ్లపై ప్రయాణించే వాహనాలు లైట్లువేసుకొని ప్రయాణం చేయాల్సివచ్చింది. పలు దుకాణాల వద్ద బోర్డులు కింద పడిపోయాయి. ఈ వర్షంతో మెట్ట పైర్లకు ప్రయోజనం చేకూరుతుందని రైతులు పేర్కొన్నారు.



కందుకూరులో ముందస్తు దీపావళి వేడుకలు

కందుకూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బీఆర్ ఆక్స్‌ఫర్డ్ ఒలింపియాడ్ స్కూల్‌లో బుధవారం ముందస్తు దీపావళి వేడుకలను నిర్వహించారు. శ్రీకృష్ణుడు, సత్యభామ, నరకాసురుడి వేషధారణలతో చిన్నారులు ఈ వేడుకలలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు పెద్దఎత్తున బాణసంచా కాల్చి, ప్రమిదలతో దీపాలు వెలిగించి వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా నరకాసురుడి బొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో విద్యాసంస్థల ఛైర్మన్ ఉన్నం భాస్కరరావు, డైరెక్టర్ జీ బాలభాస్కరరావు, కరస్పాండెంట్ బండి వెంకటేశ్వర్లు, కాలేజీ డైరక్టర్ బీ నరేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

● నేతల శుభాకాంక్షలు

కందుకూరు నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, మాజీ మంత్రి మానుగుంట మహీధరరెడ్డి, మాజీ ఎమ్మెల్యే దివి శివరాం, ఎమ్మెల్సీలు తూమాటి మాధవరావు, కంచర్ల శ్రీకాంత్, టీడీపీ నాయకుడు ఇంటూరి రాజేష్‌లు వేర్వేరు ప్రకటనల్లో దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.


నరకాసురుడి బొమ్మను దహనం చేస్తున్న విద్యార్థులు

రేషన్ పంపిణీలో అవకతవకలకు పాల్పడితే చర్యలు

లింగసముద్రం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి) : రేషన్ సరుకుల పంపిణీలో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని కందుకూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ చెంచురామయ్య చెప్పారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన రేషన్ డీలర్ల సమావేశం లో ఆయన మాట్లాడారు. డీలర్లు, ప్రతి నెలా ఒకటో తేదీన ఎండీయూ ఆపరేటర్లకు బియ్యం అందజేయాలన్నారు. తాను ప్రతినెలా రేషన్ షాపులను తనిఖీ చేస్తానని డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు అవకతవకలకు పాల్పడినట్లు తేలితే వారిని సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కే శ్రీనివాసరావు, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.




















దాడిలో గాయపడిన మహిళ మృతి


జాలమ్మ (ఫైల్)

కావలి రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : దాడిలో గాయపడిన మహిళ చికిత్స పొందుతూ మృతిచెందారు. ఈ ఘటనపై బుధవారం కేసు నమోదు చేసినట్లు కావలి రూరల్ ఎస్‌ఐ జీ రాజేశ్వరరావు తెలిపారు. వివరాల్లోకి వెళితే , ఈనెల 27న కావలి మండలం నందెమ్మపురానికి చెందిన కాటంగారి జాలమ్మ (53)కి అదే గ్రామానికి చెందిన ఆవుల మునెయ్యల మధ్య వివాదం చెలరేగింది. ఈ క్రమంలో జాలమ్మను మునెయ్య కర్రతో తలపై కొట్టడంతో తీవ్ర గాయాలై అపస్మారక స్థితికి చేరుకుంది. ఆమెను హుటాహుటిన కావలిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో నెల్లూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి, అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందారు. దాడి జరిగిన రోజు నుంచి మునెయ్య పరారీలో ఉండడంతో అతడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. దాడికి పాల్పడిన వ్యక్తి జాలమ్మ మనుమరాలి భర్త కావడం గమనార్హం.

మాన్యం భూములకు కౌలు వేలం

వలేటివారిపాలెం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జమీన్‌ఉప్పలపాడులో ఉన్న చుండి శ్రీరామలింగేశ్వరుడి ఆలయ మాన్యం భూములకు కౌలు వేలం పాటల ద్వారా రూ 4,76,100 ఆదాయం లభించినట్లు ఈవో కార్తీక్ తెలిపారు. గ్రామంలోని రామాలయం వద్ద బుధవారం ఆలయ అధికారులు కౌలు భూములకు వేలం పాటలు నిర్వహించారు. గత ఏడాది కంటే ఈ ఏడాది రూ 94,600 ఆదాయం పెరిగినట్లు ఈవో తెలిపారు. ఈ కార్యక్రమంలో గుడ్లూరు సీఐ మంగారావు, వలేటివారిపాలెం ఎస్ఐ మరిదినాయుడు ఆలయ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

● **సోమేశ్వరాలయ భూములు...**

బిట్రగుంట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : బోగోలు మండలం జక్కేపల్లిగూడూరు పంచాయతీ సోమేశ్వరాలయ భూముల కౌలు వేలాన్ని బుధవారం నిర్వహించారు. 115.70 ఎకరాల్లో మిగులు 62.38 ఎకరాల భూమికి కోవూరు ఆలయ గ్రూప్స్ ఈవో కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో వేలంపాటలు జరిపారు. ఏడుబిట్లకుగాను సర్వే నంబరు 104/1లో 1.71 ఎకరాలను రైతులు వేలం పాడుకున్నారు. మిగిలిన భూములకు త్వరలో కౌలు వేలం తేదీని తెలుపుతామని ఈవో తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు

వెంకటాచలం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెముడుగుంట వద్ద కోల్‌కత్తా-చెన్నై జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు... తిరుపతి జిల్లా గూడూరుకు చెందిన ప్రవీణ్ మోటర్ బైక్‌పై నెల్లూరుకు వచ్చి తిరిగి గూడూరుకు వెళ్లా చెముడుగుంట వద్ద ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ఘటనలో ప్రవీణ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం హైవే అంబులెన్స్‌లో నెల్లూరు ప్రభుత్వ అసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంతో రహదారిపై సుమారు అర కిలోమీటరు వరకు ట్రాఫిక్ స్తంభించింది.































బాణసంచా దుకాణాల ఏర్పాటు



ఉదయగిరిలోని బాణసంచా దుకాణం

ఉదయగిరి రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆనకట్ట సమీపాన గల వైఎస్ఆర్ విగ్రహం వద్ద బుధవారం బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేశారు. నిబంధనలు పాటిస్తూ విక్రయాలు చేపట్టాలని, ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఇన్‌చార్జి ఫైర్ అధికారి అశోక్‌కుమార్ తెలిపారు.

అనంతసాగరంలో విషజర్వాలు

అనంతసాగరం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): అనంత సాగరంలో విషజర్వాలు ప్రబలు తున్నాయి. ఇటీవల వర్షాలు కురిసి వాతావరణంలో మార్పు రావడంతో పాటు పారిశుధ్యం లోపించి దోమలు పెరిగి వ్యాధుల బారిన పడుతున్నట్లు స్థానికులు వాపో తున్నారు. ఇకనైన అధికారులు స్పందించి పారిశుధ్యం మెరుగుపర్చి వ్యాధులను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

టపాసుల దుకాణాల పరిశీలన



టపాసుల దుకాణాల లైసెన్సులను పరిశీలిస్తున్న సీఐ వేమారెడ్డి

సంగం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): సంగం శివాలయం సెంటర్‌లో ఏర్పాటు చేసిన టపాసుల దుకాణాలను బుధవారం సీఐ వేమారెడ్డి, ఇన్‌చార్జి తహసీల్దారు సంధ్య వేర్వే రుగా తనిఖీ చేశారు. దుకాణాలకు లైసెన్సులు ఉన్నాయో లేవోనని పరిశీలించారు. తప్ప కుండా నిబంధనలు పాటించాలని హెచ్చరిం చారు. ఈ కార్యక్రమంలో వారి వెంట స్థానిక పోలీసులతోపాటు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

పాలకుల నిర్లక్ష్యం... ప్రజలకు శాపం

- శిథిలావస్థలో వాటర్ ప్లాంట్
- నిరుపయోగంగా ట్రాక్టర్లు, ట్యాంకరు



మూతపడ్డ వాటర్ ప్లాంట్



తుప్పు పడుతున్న యంత్రాలు



నిరుపయోగంగా వాటర్ ట్యాంకర్లు

ఏఎస్ పేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పాలకులు, అధికారుల నిర్లక్ష్యం ప్రజలకు శాపం గా మారింది. లక్షల రూపాయలు వెచ్చించి ఏర్పాటుచేసిన వాటర్ ప్లాంట్ సంవత్సరం తిరగకముందే మూతపడింది. 12 గ్రామాల్లో ప్రజలకు మంచి నీరు అందించాలన్న ఉద్దేశ్యంతో నిర్మించిన వాటర్ ప్లాంట్ నిరుపయోగంగా మారింది. దీంతో తాగునీటి కోసం అవస్థలు పడుతున్నా పట్టించుకునే నాథుడే లేడని గ్రామ స్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రమైన ఏఎస్ పేటతో పాటు సమీపంలోని చందులూరుపాడు, మదారాబాదు, జమ్మవరం, కాకర్లపాడు, చౌటభీమవరం, పెద్దహబీపురం, అనుమసముద్రం, గండువారిపల్లి, పందిపాడు, పోనుగోడు, తెల్లపాడు తదితర 12 గ్రామాల్లో ప్రజలకు మినరల్ వాటర్ అందించాలనే ఉద్దేశ్యంతో గండువారిపల్లిలో సుజల స్రవంతి పథకం కింద మెయిన్ వాటర్‌ప్లాంట్‌ను ఏర్పాటుచేశారు. ప్లాంట్ నుంచి గ్రామాలకు నీటిని తరలించడానికి సుమారు 5 ట్యాంకర్లు, ట్రాక్టర్లు ఏర్పాటుచేశారు. దీంతో 12 గ్రామాల ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా పోయింది.

విద్యుత్ బిల్లులు చెల్లించకపోవడంతో మూతబడ్డ ప్లాంట్

ప్లాంట్ ప్రారంభించిన మొదటిలో బాగానే ఉన్నా తరువాత నెలల తరబడి విద్యుత్ బిల్లులు చెల్లించకపోవడం, అటు అధికారులు, ఇటు పాలకులు పట్టించుకోకపోవడంతో మూతపడింది. దీంతో నీటిని శుద్ధిచేసే విలువైన యంత్రాలు తుప్పు పట్టిపోయాయి. ట్యాంకర్లు, ట్రాక్టర్లు నిరుపయోగంగా మారాయి. తాగునీటి కోసం ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి ప్లాంట్‌ను పునరుద్ధరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజల సంతృప్తి

- టీడీపీ పట్టణ అధ్యక్షుడు తుమ్మల



సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న టీడీపీ పట్టణ అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి

ఆత్మకూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాల పట్ల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని టీడీపీ పట్టణ అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, తెలుగు యువత మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు పిడికిటి వెంకటేశ్వర్లునాయుడు, గొట్టి గుండాల బుజ్జిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆత్మకూరు పట్టణంలోని 6, 12వ వార్డుల్లో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు డి శివకోటారెడ్డి, జి వేణు, మాజీ కౌన్సిలర్ జి నాగభూషణమ్మ, టీడీపీ నాయకులు పరిటాల సత్యం, క్రిష్ణయ్య, మెంటా శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

గంగమిట్టలో ...

- వింజమూరు: గంగమిట్ట ప్రాంతంలో బుధవారం టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చల్లా వెంకటేశ్వర్లు యాదవ్ ముస్లిం మైనారిటీ మండల నాయకుడు షేక్ మహ బూబ్‌బాషా ఆధ్వర్యంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

రోడ్డుమార్జిన్ల ఆక్రమణతో ట్రాఫిక్ సమస్య



రోడ్డు మార్జిన్‌లో నిర్వహిస్తున్న అంగళ్లు

వింజమూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్ట ణంలో రోడ్డుమార్జిన్ల ఆక్ర మణలతో నిత్యం ట్రాఫిక్ సమస్యతో అవస్థలకు గురి కావల్సి వస్తోందని ప్రజలు, వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యం గా బంగ్లా సెంటర్ నుంచి కొత్త బస్టాండు వరకు రోడ్డుపై వాహనాలు నిలపడం, అలాగే రోడ్డు మార్జిన్‌లలో బండ్లు పెట్టుకుని వ్యాపారాలు నిర్వహిస్తుండడంతో ట్రాఫిక్ సమస్య తలె త్తు తోందని, ముఖ్యంగా హైస్కూల్, వైఆర్ జూనియర్ కాలేజీ దగ్గర రోడ్డును ఆక్రమంచి దుకాణాలు ఏర్పాటు చేసుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ప్రజలు కోరుతున్నారు.

మందుబాబులకు అడ్డాగా బస్ షెల్టర్

వరికుంటపాడు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మహమ్మదాపురంలో నిర్మించిన బస్ షెల్టర్ చుట్టూ కంపచెట్లు పెరిగి అధ్వానంగా ఉండడంతో నిరుపయోగంగా మారి మందుబాబులకు అడ్డాగా మారింది. ప్రధాన రహదారికి ఆనుకొని బస్ షెల్టర్ నిర్మించినప్పటికీ అటుగా వెళ్లేందుకు ప్రయాణికులు వెనకడుగు వేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బస్ షెల్టర్ చుట్టూ కంపచెట్లను తొలగించడంతో పాటు మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఆధార్ అప్‌డేట్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఉదయగిరి రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉదయగిరి-1, అప్పసముద్రం సచివాలయాల్లో ఆధార్ అప్‌డేట్ కేంద్రాలు అందుబాటులోకి వచ్చేలా చర్యలు చేపడతామని ఇన్‌చార్జి ఎంపీడీవో అప్పాజీ పేర్కొన్నారు. బుధవారం ఆంధ్రజ్యోతిలో ఆధార్‌లో తప్పులు.. అపార్‌కు కష్టాలు... అనే కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన ఆయన శకునాలపల్లి సచివాలయంలో మాత్రమే ఆధార్ కేంద్రం పనిచేస్తుండడంతో దూర ప్రాంతాల నుంచి ప్రజలు అక్కడకెళ్లాల్సి వస్తోందన్నారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఆయా సచివాలయాల్లో సైతం ఏర్పాటు చేసేలా కృషి చేస్తామన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు సాధించాలి

ఉదయగిరి రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయాధికారి ఆంజనేయుల నాయక్ సూచించారు. బుధవారం మండలంలోని బండగానిపల్లి, జీ.చెరువుపల్లి పంచాయతీల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సాగులో ఉన్న పసుపు, వరి తదితర పంటలను పరిశీలించి రైతులకు సస్య రక్షణ చర్యలు, యాజమాన్య పద్ధతులను వివరించారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

విత్తన శుద్ధిపై అవగాహన

- అనంతసాగరం: పంటల సాగులో నత్రజని ఎరువులు అధికంగా వాడితే తెగుళ్ల వ్యాప్తి ఎక్కువగా ఉంటుందని, నత్రజని వాడకం తగ్గించాలని వ్యవసాయాధికారి శ్రీధర్‌రెడ్డి రైతులకు సూచించారు. మండలంలోని చిలకలమర్రి, గుడిగుంటలో బుధవారం రైతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి పంటల సాగు, సస్యరక్షణ చర్యలు, విత్తన శుద్ధిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచులు కటారి నారాయణమ్మ, నరసింహరాజు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

- వలేటివారిపాలెం : శనగసైరులో ఉత్తమ యాజమాన్య పద్ధతులు పాటించాలని కందుకూరు కేవీకే సీనియర్ శాస్త్రవేత్త ప్రసాద్ తెలిపారు. మండలంలోని నలదలపూరు గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఆ కార్యక్రమంలో ఏవో హేమంత భరత్‌కుమార్, శాస్త్రవేత్తలు వెంకటేష్, మయాంక్, వ్యవసాయ సహాయకులు శశిధర్ పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టండి

- లింగసముద్రం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): పంటల సాగులో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టి, అధిక దిగుబడులు పొందాలని మండల వ్యవసాయ అధికారి టీ అబ్రహాంలింకన్ చెప్పారు.బుధవారం లింగసముద్రంలోని రైతు సేవా కేంద్రంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వీఏఏ మణికిరణ్, పాల్గొన్నారు.

విత్తనశుద్ధితో చీడపీడల నివారణ

- కందుకూరు : వరి, శనగ సాగు చేసే రైతులు విధిగా విత్తనశుద్ధి చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి వీ రాము సూచించారు. బుధవారం మండలంలోని కొండముడుసు పాలెం, కంచరగుంట గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వరి నారుమళ్లను ఆయన పరిశీలించి, రైతులకు పలు సూచనలు చేశారు. నారుమడిలో నీరు ఎక్కువ నిల్వలేకుండా చూసుకుంటే ార్యక్రమంలో మార్కెటింగ్ అధికారి ఖాసిం, వ్యవసాయ సహాయకులు రమాదేవి, కే శరత్‌కుమార్, పశువైద్య అసిస్టెంట్లు ఏ శోభన్‌బాబు, భరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రబీకి రెడీ



నెల్లూరు రూరల్ మండలంలో విత్తనాలు చల్లుతున్న రైతు

- 'రూరల్'లో కేఎన్ఎం 1638 రకానికి తొలి ప్రాధాన్యం
- రెండు, మూడు స్థానాలలో బీపీటీ, ఆర్ఎన్ఆర్
- పంటలో 10 శాతం ఎంటీయూ వైపు మొగ్గు
- దుక్కులకు సిద్ధమైన రైతన్న

నెల్లూరు రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : వాతావరణం అనుకూలంగా ఉండటంతో రబీ వ్యవసాయ సీజన్‌కు కర్షకులు సిద్ధమయ్యారు. ఈ నెల నుంచి సంప్రదాయ సీజన్ ఆరంభమవుతుండటంతో నెల్లూరు రూరల్లోని సుమారు 25 వేల ఎకరాల్లో వరి సాగుచేసేందుకు రైతులు సమాయత్తమవు తున్నారు. తొలి ప్రాధాన్యత రకంగా తమిళనాడుకు చెందిన కేఎన్ఎం 1638 వరి సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఇది సన్న రకమేకాక అధిక దిగుబడినిస్తూ చీడపీడలను తట్టుకునే శక్తి కలిగి ఉండటంతో దీనివైపు మొగ్గు చూపుతున్నారు. రెండు, మూడు ప్రాధాన్యాల్లో బీపీటీ, ఆర్ఎన్ఆర్ రకాలను సాగు చేయాలని నిర్ణయించుకున్నారు. ఎప్పుడూ లేనంతగా ఈ సారి ఎంటీయూ 1010 (లావులు) రకాన్ని కూడా సాగు చేసేందుకు రైతులు విత్తనాలను సమీకరించుకోవడం గమనార్హం. బొరుగులు, అటుకుల తయారీకి ఈ వరిని ఉపయోగిస్తుండటంతో దీనికి కూడా గిరాకీ పెరిగింది. గత సీజన్‌లోనూ పుట్టి ధర రూ.16 వేల నుంచి 17 వేలు పలికింది. ఈ క్రమంలో మండలంలోని సుమారు 10 శాతం పొలాల్లో ఈ రకాన్ని పండించనున్నట్లు అంచనా. మొత్తంగా పల్లెల్లో సేద్యం గత్తర మొదలైంది.

ఇటీవల కురిసిన వర్షాలతో వనరుల్లో నీరు పుష్కలంగా ఉండటంతో అన్నదాతలు వరి పండించేందుకు పనులు ముమ్మరం చేశారు. నెల్లూరు రూరల్ మండలంలో కనుపూరు కాలువ, సర్వేపల్లి కాలువ, లేబూరు, కోడూరు కాలువలతోపాటు చెరువుల్లోనూ నీటి నిల్వలున్నాయి. పైగా సోమశిల జలాశయంలోకి భారీగా వరద నీరు చేరడంతో సాగునీటికి ఢోకాలేదని గ్రహించిన రైతులు సాగుకు సిద్ధమయ్యారు. రూరల్లోని అన్నీ గ్రామాల్లో పొలాలను నారుమళ్లకు సిద్ధం చేసుకుంటున్నారు. ఎల్లుక్కిలకు స్వస్తి పలికిన అన్నదాతలు బురద దుక్కులలో నిమగ్నమయ్యారు. ట్రాక్టర్లకు డిమాండ్ పెరగడంతో విత్తనాలు చల్లుకునేందుకు కయ్యల్లో పాదులు సిద్ధం చేసుకుంటున్నారు.

పుష్కలంగా విత్తనాలు



రబీ వ్యవసాయ సీజన్‌కు విత్తనాల కోసం రైతులు ఇబ్బందులు పడాల్సిన అవసరం లేదు. అటు ప్రైవేట్ దుకాణాల్లో ఇటు ఏపీ సీడ్స్‌లోనూ పుష్కలంగా విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. ఏ రకం కావాలన్నా లభిస్తాయి. పైగా పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పంటలపై అన్నదాతలకు అవగాహన కూడా కల్పించాము.

\- ఎస్వీ నాగమోహన్, నెల్లూరు రూరల్ ఏవో

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

- 15 మంది అరెస్ట్
- రూ 8.8 లక్షల నగదు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వేణుగోపాల్

అనంతసాగరం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిలకలమర్రి వద్ద జాతీయ రహదారి పక్కన మామిడి తోటలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై ఆత్మకూరు డివిజన్ పోలీసులు శుక్రవారం సాయంత్రం మెరుపు దాడి నిర్వహించారు. పేకాట ఆడుతున్నట్లు అందిన సమాచారంతో ఆత్మకూరు సీఐ గంగాధర్, అనంతసాగరం, ఆత్మకూరు, మర్రిపాడు ఎస్‌ఐలు సూర్యప్రకాష్‌రెడ్డి, జిలాని, శ్రీనివాసరావు పోలీసు సిబ్బందితో వెళ్లి దాడులు నిర్వహించారు. ఈ దాడిలో 15 మంది పేకాటరాయుళ్లు పట్టుపడగా రూ 80,8465 నగదు, 11 సెల్‌ఫోన్లు, 3 కార్లు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ వేణుగోపాల్ మీడియా సమావేశంలో వెల్లడించారు. పట్టుబడిన వారిలో నెల్లూరుతో పాటు కడప జిల్లాకు చెందిన వారు ఉన్నట్లు గుర్తించారు. ఈసందర్భంగా సిబ్బందిని డీఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

సాగరంలో పట్టపగలే చోరీ

- అనంతసాగరం : మండల కేంద్రం అనంతసాగరంలో దుండగులు పట్టపగలే చోరీకి తెగపడ్డారు. బుధవారం సాయంత్రం నాగిరెడ్డి అమరావతి ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో బయటకు వెళ్లగా గుర్తించి దుండగులు ఇంట్లోకి చొరబడి బీరువా తాళం పగులగొట్టారు. అందులోని 35 గ్రాముల బంగారు ఆభరణాలు తీసుకెళ్లారు. అలాగే లాల్‌బాగ్‌లోని మరో ఇంట్లోకి చొరబడేందుకు ప్రయత్నించగా స్థానికులు గుర్తించడంతో పరార్ అయ్యారు. సమాచారం తెలుసుకొన్న పోలీసులు చోరీ జరిగిన ప్రాంతాలకు వెళ్లి వివరాలు రాబట్టారు.

అల్లూరులో ఎక్స్‌కవేటర్...

- అల్లూరు : పట్టణంలో ఎక్స్‌కవేటర్ చోరీకి గురైంది. బాధితుడి కథనం మేరకు, స్థానిక కోనేటి సెంటరులో హార్డ్‌వేర్ వర్క్ చేసుకుంటున్న మోజెస్‌కి చెందిన ఎక్స్‌కవేటర్ మంగళవారం రాత్రి ఎప్పటిలా తన దుకాణం వద్ద నిలిపి ఇంటికి వెళ్లాడు. గుర్తుతెలియని వ్యక్తులు అర్ధరాత్రి దాన్ని దొంగిలించుకు వెళ్లారు. స్థానికంగా ఈ విషయం చర్చనీయాంశమైంది. సాధారణంగా ద్విచక్ర వాహనాలు చోరీకి గురవుతూ ఉంటాయి. కానీ తొలిసారిగా అల్లూరులో ఎక్స్‌కవేటర్ దొంగతనానికి గురవడం విడ్డూరంగా ఉందని స్థానికులు అంటున్నారు. ఈ విషయంపై బాధితుడు పోలీస్‌స్టేషనులో ఫిర్యాదు చేయగా, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కిషోర్ కుమార్ తెలిపారు.

దుకాణంలో పాము కలకలం



పామును చంపిన స్థానికులు

- ఉదయగిరి రూరల్ : పట్టణంలోని తహసీల్దారు కార్యాలయం ఎదురుగా ఉన్న జెరాక్స్ అండ్ నెట్ దుకాణంలోకి బుధవారం ఓ పాము దూరింది. దీంతో దుకాణంలో ఉన్న స్థానికులు భయభ్రాంతులకు గురై ఒక్కసారిగా బయటకు పరుగులు తీశారు. జెరాక్స్ మిషన్‌లోకి దూరిన పామును స్థానికుల సహాయంతో దుకాణ యజమాని చంపేశాడు.

మంత్రి ఆనం దీపావళి శుభాకాంక్షలు

ఆత్మకూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రజలందరూ దీపావళి పండుగను సంతోషంగా జరుపుకోవాలని రాష్ట్ర దేవదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. చీకటిపై వెలుగు, చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకే దీపావళి పండుగ అని అన్నారు.

రేపు మధ్యాహ్నానికి పింఛన్లు పూర్తి చేయండి

లింగసముద్రం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీని నవంబరు ఒకటో తేదీ మధ్యాహ్నం ఒంటి గంటకల్లా పూర్తి చేయాలని ఎంపీడీవో కె శ్రీనివాసులు చెప్పారు.బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో పింఛన్ల పంపిణీపై పంచాయతీ కార్యదర్శులు, డీఏలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉదయం ఆరు గంటలకే పింఛన్ల పంపిణీని ప్రారంభించాలన్నారు.


సకాలంలో నీరొస్తే 20 వేల ఎకరాల్లో వరి

- పొదలకూరు మండల చెరువులను జలాశయాలతో అనుసంధానం
- కాలువల ద్వారా నీటి విడుదల, వర్షపాతంపై రైతుల ఆశ

పొదలకూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పొదలకూరు ప్రాంతంలో ఈ నెలలో ఆశించిన స్థాయిలో వర్షపాతం నమోదవడం, చెరువుల్లో ఇప్పటి వరకు 30 శాతం వర్షపు నీరు చేరడం, నవంబరులో కూడా అధిక వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉండడంతో రబీలో సాగునీటి ఇబ్బందులు ఉండవని రైతులు భావిస్తున్నారు. పొదలకూరు మండల పరిధిలో మొత్తం 54 చెరువులు ఉన్నాయి. దాదాపు అన్ని చెరువులకు ఏదోరకంగా సోమశిల, కండలేరు ప్రాజెక్టుల నుంచి కాలువల ద్వారా సాగునీరు అందే అవకాశం ఉంది. అధికారులు రైతులను సమన్వయ పరిచి కాలువల ద్వారా సాగునీటిని అందిస్తే మండలంలో 20వేల ఎకరాల్లో వరిసాగు చేసేందుకు వీలుంది. అమ్మవారిపాలెం, పీజీ పట్నం గ్రామ చెరువులకు మాత్రం గత ఐదేళ్ల వైసీపీ పాలనల్లో దక్షిణ కాలువ నిర్మాణం పూర్తి కాకపోవడం వల్ల చెరువుల్లోకి నీరు చేరే అవకాశం లేదు. కనుపూరు, దక్షిణ, ఎడమగట్టు, ఒకటో బ్రాంచి కాలువలు, కండలేరు ఏటి కాలువ ద్వారా చెరువులకు సాగునీరు అందుతోంది. కళ్యాణపురం పొట్టేళ్ల కాలువ చెరువు వర్షానికి నిండింది.

ఉపకాలువల ద్వారా...

సోమశిల దక్షిణ కాలువ దాని ఉపకాలువల ద్వారా మండలంలోని చెన్నారెడ్డిపల్లి, భోగసముద్రం, నావూరుపల్లి చెరువులను నింపే అవకాశం ఉంది. వీటికి కాలువ నీటితో పాటు వర్షం తోడు అయితే ఇబ్బందులు ఉండవు. ఎడమగట్టు కాలువల ద్వారా మొత్తం 32 చెరువులకు సాగునీటిని అందించే అవకాశం ఉంది. ఇప్పటికే అందుబాటులో ఉన్న నీటితో రైతులు నార్లు పోసుకుంటే తర్వాత నాట్ల సమయంలో కాలువ ద్వారా చెరువులను నింపే అవకాశం ఉంటుందని రైతులు భావిస్తున్నారు. కనుపూరు కాలువ ద్వారా మండలంలోని తాటిపర్తి, నల్లపాలెం, వెలికంటిపాలెం, నేదురుపల్లి, ఆనాటి కండ్రిక గ్రామాలకు నీరు అందుతుంది. కండలేరు ఏటి కాలువకు సైతం ప్రాజెక్టులో లెవల్ స్లూయిజ్ ద్వారా నీటిని విడుదల చేస్తే పంటలను పండించవచ్చు. ఈ కాలువ కింద మనుబోలు మండలం వరకు రైతులు విద్యుత్ మోటార్లను ఏర్పాటు చేసుకుని నీటిని పెట్టుకుంటారు.



32 చెరువులకు నీటి అందించే కండలేరు ఎడమ గట్టు కాలువ

జ్వరాలను నిర్లక్ష్యం చేయొద్దు

డాక్టర్ రమేష్, లింగసముద్రం పీహెచ్‌సీ వైద్యాధికారి

ముఖాముఖి



లింగసముద్రం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి జ్వరం వచ్చినా ప్రజలు నిర్లక్ష్యం చేయవద్దని లింగసముద్రం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పీ రమేష్ చెప్పారు.జ్వరాలు వచ్చిన రోగులు వెంటనే అందుబాటులోని పీహెచ్‌సీలో డాక్టర్‌ను సంప్రదించి, అవసరమైన పరీక్షలు చేయించుకొని మందులు వాడాలి.పీహెచ్‌సీలో 62 రకాల రక్త పరీక్షలు, 174 రకాల మందులు లభిస్తాయి.డాక్టర్ చెప్పిన విధంగా మందులు వాడి అన్ని రకాల జ్వరాల, వ్యాధుల బారి నుంచి విముక్తి పొందాలి

? జ్వరాలతో పీహెచ్‌సీకి వచ్చే రోగులకు వైద్య సేవలు ఎలా అందుతున్నాయి.

! వైద్య సేవలు బాగా అందిస్తాం. పీహెచ్‌సీలో డెంగ్యూ, టైఫాయిడ్, మలేరియా, సీపీబీ పరీక్షలు చేసి తగిన విధంగా చికిత్స అందిస్తాం. జ్వరాలు వస్తే వెంటనే పీహెచ్‌సీకి రావాలి

? రోగులకు రక్త పరీక్షలు ఎలా చేస్తున్నారు.

! ఒక్క రక్తపు చుక్కతో 62 రకాల పరీక్షలు చేస్తాం.దాన్ని బట్టి చికిత్స చేస్తాం

? పీహెచ్‌సీకి రోజుకు ఎంతమంది వస్తున్నారు.

! రోజుకు సరాసరిన 160మంది వస్తారు.

? సిబ్బంది, మందుల కొరత ఉందా.

! పెంట్రాలలో ఏఎన్ఎం లేరు. పీహెచ్‌సీలో, గానీ, వీహెచ్‌సీలో గానీ సిబ్బంది కొరత లేదు. మందుల కొరత అసలే లేదు.

న్యూస్ బాక్స్

రక్తదానం చేయాలి



రక్తదానం చేస్తున్న సీఐ, పోలీసులు

సంగం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రక్తదానం ప్రాణదానంతో సమానమని ఆత్మకూరు డీఎస్పీ వేణుగోపాల్ పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా బుధవారం సంగం పోలీస్‌స్టేషన్‌లో సీఐ వేమారెడ్డి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం స్థానిక పోలీసులతోపాటు, యువకులు, పలుపార్టీల నాయకులు, కార్యకర్తలు రక్తదానం చేశారు. రక్తదాతలకు డీఎస్పీ సర్టిఫికెట్‌లు అందచేశారు. ఈకార్యక్రమంలో సేవా బ్లడ్ బ్యాంక్ చైర్మన్ భాస్కర్‌నాయుడు, సీఐ వేమారెడ్డి, సంగం, ఏఎస్‌పేట, చేజర్ల ఎస్‌ఐలు, పోలీసులు పాల్గొన్నారు.

ఎంపీలు స్పందిస్తే బిట్రగుంట రైల్వే అభివృద్ధి

బిట్రగుంట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన ఎంపీలు స్పందిస్తే బిట్రగుంట రైల్వే అభివృద్ధి జరుగుతుందని మండల బీజేపీ అధ్యక్షుడు నూకసాని శ్రీనివాసులు యాదవ్ అన్నారు. బిట్రగుంట రైల్వే ఫుట్‌బాల్ క్రీడామైదానంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ విషయమై నెల్లూరులో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని కలిసామన్నారు. బిట్రగుంట రైల్వే ప్రదేశంలో ఆర్వోహెచ్ ప్రాజెక్టును ఏర్పాటు చేయించాలని కోరామన్నారు. ఆయన వెంట రైల్వే విశ్రాంత ఉద్యోగులు గోవిందరాజు, విజయ్‌కుమార్, రాజన్న ఉన్నారు.

సచివాలయ సిబ్బందికి శిక్షణ

వింజమూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సచివాలయ సిబ్బందికి నైపుణ్య గణన సర్వేపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీవో కె శ్రీనివాసులురెడ్డి అధ్యక్షత వహించి మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి 15 సంవత్సరాలు పైబడి 59 సంవత్సరాల లోపు వయసు కలిగిన వారు ఎలాంటి నైపుణ్యాన్ని కలిగి ఉన్నారో సమాచారాన్ని సేకరించి నివేదిక తయారు చేస్తారని, వారికి సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ వ్యవస్థాపకుడికి ఘన నివాళులు



హెన్రీడూనాంట్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రెడ్‌క్రాస్ బాధ్యులు

కావలిటౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : రెడ్‌క్రాస్ వ్యవస్థాపకుడు సర్ హెన్రీడూనాంట్ వర్ధంతి సందర్భంగా బుధవారం రెడ్‌క్రాస్ రక్తనిధి కార్యాలయంలో ఆయనకు ఘననివాళులర్పించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అనంతరం రెడ్‌క్రాస్ కేంద్రం కన్వీనర్ డాక్టర్ బెజవాడ రవికుమార్, రవిప్రకాష్, హరినారపరెడ్డి, కలికి సాయికుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చీరల పంపిణీ

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని పడారుపల్లిలో ఉన్న వికలాంగుల ఉపాధి శిక్షణా కేంద్రంలో బుధవారం రోటరీ క్లబ్ సౌత్ ఆధ్వర్యంలో ది వ్యాంగులకు చీరలు, దీపాలు, గాజుల పంపిణీ జరిగింది. అనంతరం భోజనం అందించారు. రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ శ్రీహరి, కార్యదర్శి మల్లికా బేగం మాట్లాడుతూ దీపావళి సంద ర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించామని చెప్పారు. శిక్షణా కేంద్రం అధినేత క్రాంతి, మహిళా సంఘం అధ్యక్షురాలు వెంకటలక్ష్మి, గవర్నర్ ఒమ్మిన సతీష్, జి.సుభద్రాదేవి, దగ్గుపాటి రాధాకృష్ణ పాల్గొన్నారు.

'రూరల్' అభివృద్ధికి చేయూతనివ్వండి

- సీఎం చంద్రబాబును కోరిన ఎమ్మెల్యే కోటంరెడ్డి

నెల్లూరు రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్ నియోజకవర్గ అభివృద్ధికి చే యూతనివ్వాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడుకు ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలో సీఎంను మర్యాదపూర్వకంగా కలిసి దీపావళి శు భాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ తన నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే నెంబర్ వన్ స్థానంలో నిలపాలన్న సంకల్పంతో పని చేస్తున్నానని, అందుకు నిధులిచ్చి చేయూతనందించాలని ముఖ్యమంత్రిని కోరినట్లు చెప్పారు. దీనికి చంద్రబాబు సాను కూలంగా స్పందించారని చెప్పారు.

ఇసుక అధిక ధరలకు కళ్లెం

రాష్ట్రంలో ఇసుక అధిక ధరలకు కళ్లెం వేస్తూ ముఖ్యమంత్రి చంద్ర బాబు తీసుకున్న నిర్ణయం ప్రశంసలు కురిపిస్తోందని ఎమ్మెల్యే కోటం రెడ్డి అన్నారు. బుధవారం నెల్లూరులోని ఆయన కార్యాలయంలో భవన నిర్మాణ కార్మికులు, మేస్త్రీలు, ట్రాక్టర్ల డ్రైవర్లు, ఓనర్లు, ఎడ్లబండ్ల నిర్వా హకులతో ముఖాముఖి నిర్వహించారు. గత ప్రభు త్వంలో ఇసుకను బంగారం కంటే ఎక్కువగా చూపి దోచుకున్న వారు దోచుకున్నంత అ న్నట్లు వ్యవహరించారన్నారు. అందుకే పాలనకు జగన్, వైసీపీ పనికి రావని ఇటీవలి ఎన్నికల్లో ప్రజలు తేల్చి చెప్పారన్నారు. అనంతరం ఇ సుక పాలసీ పై పలువురి అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్ర మంలో టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు నడుం బిగించాలి

జీజీహెచ్‌లో దివాలి విత్ మై భారత్ నగర కమిషనర్ సూర్యతేజ



నెల్లూరు (వైద్యం), అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణకు యువత నడుం బిగించాలని నగర కమిషనర్ సూర్యతేజ పిలుపునిచ్చారు. బుధవారం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో దివాలి విత్ మై భారత్ కార్యక్రమం జరిగింది. వీఎస్‌యూ, వీ ఎస్‌ఎస్ వలంటీర్లు, కృష్ణచైతన్య డిగ్రీ కళాశాల విద్యార్థులు ఆసుపత్రి ప్రాం గణంలో పిచ్చి మొక్కలను తొలగించా రు. పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ తడి, పొడి చెత్తను, వైద్య వ్యర్థాలను వేరుచేసి పర్యావరణాన్ని కాపాడాలని సూచిం చారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధానాయక్, నెహ్రూయువ కేంద్రం అధికారి మహేంద్రరెడ్డి మాట్లాడుతూ యువతలో సేవా భావాన్ని, దేశభక్తిని పెంపొందించాలన్నారు. అనంతరం సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సెట్నెల్ సీఈవో శ్రీనివాసులు, డాక్టర్ సుబ్బారెడ్డి, డాక్టర్ మస్తాన్‌బాషా, రూడ్స్ ట్రస్ట్ చైర్మన్ షేక్ రసూల్, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్, శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర కులగణన జరిపించండి

● సీఎం చంద్రబాబుకు బీసీ సంఘం వినతి

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో సమగ్ర కులగణన జరిపించి బీసీలకు న్యాయం చేయాలని కోరుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబుకు ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు గురువారం 12 విజ్ఞాపన పత్రాలు అందజేశారు. అలాగే బీసీ సంక్షేమ సంఘం తరపున వరద బాధితుల సహాయం కోసం రూ.10లక్షల విరాళం అందజేశారు. ఈ కార్య క్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజు శ్రీనివాస గౌడ్, గౌడ బీసీ సంక్షేమ సంఘం నాయకుడు కల్లూరు నాగరాజు గౌడ్, తిరుపతి జిల్లా అధ్యక్షుడు పలమల శ్రీహరిరావు, నెల్లూరు జిల్లా నాయకులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో తెగుళ్ల నివారణ

ముత్తుకూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): నారుమడిలో సరైన యాజమాన్య పద్ధతులను పాటించడం ద్వారా వరి నాటిన 25 నుంచి 30 రోజులు వరకు తెగుళ్ళ, పురుగుల బారినపడ కుండా పైరును కాపాడుకోవచ్చని ఆత్మ పీడీ శివనారాయణ తెలిపారు. తాళ్లపూడి రైతు సేవా కేంద్రంలో బుధవారం జరిగిన పొలం పిలుస్తోం ది కార్యక్రమంలో ఇందుకూరుపేట ఏడీఏ రాజ్ కుమార్‌తో కలసి ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్ర మంలో వ్యవసాయాధికారిణి జోత్స్నరాణి, వీపీ శ్రీను, ఏఈవో దేవరాజ్, తదితరులు పాల్గొన్నారు.


ఇందుకూరుపేట(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తూరు, కొత్తూరు చింతోపు గ్రామాలలో వ్యవసాయాధికారి రఘునా థరెడ్డి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వీహెచ్‌ఏ మాధవయ్య, ఝాన్సీ పాల్గొన్నారు.

వెంకటాచలం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాకుటూరు, చెముడుగుంట గ్రా మాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారిణి సత్యవాణి, వ్యవసాయ సహాయ సంచాలకులు శ్రీనివాసులు, శివనాయక్, మండల వ్యవసాయ అధికారి హరికరుణాకర్‌రెడ్డి, షేక్ రిజ్వానా, ఎన్ జాహ్నవి పాల్గొన్నారు.





















కండలేరు ఎడమ కాలువకు నీరు విడుదల

పొదలకూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి) : కండలేరు జలాశయం నుంచి కండలేరు ఎడమ కాలువకు బుధవారం కాలువ ఈఈ అనిల్ కుమార్‌రెడ్డి టీడీపీ మండల నాయకులతో కలిసి డ్యాం నుంచి 120 క్యూసెక్కుల నీటి ని విడుదల చేశారు. ఈ సందర్భం గా మండల అధ్యక్షుడు తలచీరు మస్తాన్‌బాబు మాట్లాడుతూ రైతు లు నాట్లు వేసుకునేందుకు సర్వేప ల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆదేశాలతో అధికారులు నీటి ని విడుదల చేసినట్లు తెలిపారు. అలాగే నిమ్మ, మామిడి, సపక, జా మాయిల్ తోటలకు, పశువులు, మూగజీవాల దాహార్తిని తీర్చుటకు ఈ సాగునీరు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోడూరు పెంచలభాస్కర్‌రెడ్డి, కలిచేటి ప్రభాకర్‌రెడ్డి, పులిపాటి వెంకటరత్నం, శ్రీనివాసులురెడ్డి, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికుల సొసైటీ ఏర్పాటు

కోవూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): నూతనంగా చేనేత సొసైటీ ఏర్పాటు చేసేందుకు వీలుగా స్థానిక గుమ్మళ్లదిబ్బ కాలనీలో బుధవారం చేనేత కార్మికుల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. రాజరాజేశ్వరి సొ సైటీ పేరుతో కొత్తగా సొసైటీ ఏర్పాటు చేయాలని తీర్మానించారు. సొసైటీ ప్రమోటర్‌గా పోలిశెట్టి వెంకటేశ్వర్లును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో చేనేత సంఘ అసిస్టెంటు డెవలప్‌మెంటు అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు కేవీ శేష య్య, పులి శేషయ్య పాల్గొన్నారు.

నేడు ఇస్తిమా గార్వీ

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : నగరంలో చిన్నబజార్‌లోని మజీద్ షహిన్షా ఖాజా పీర్ మఖాన్ వద్ద గురువారం ఇస్తిమా గార్వీ (ఆధ్యాత్మిక సభ) జరుగుతుందని నిర్వాహకుడు కేఎస్ఎస్ బాబా ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముస్లింలు అందరూ హాజరుకావాలని కోరారు.

ఘనంగా వార్షికోత్సవం

కేతా అంకులు మెమోరియల్ ట్రస్టు 35వ వార్షికోత్సవం సుబేదార్‌పేటలో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన పాట కచేరీ ఆహూతులను అలరించింది. కళాకారులను కేతా ట్రస్ట్ నిర్వాహకుడు సుబ్బారావు సన్మానించారు.





















పొలం కొలతలు వేస్తుండగా రైతుపై దాడి

తోటపల్లిగూడూరు, అక్టోబరు 30(ఆంధ్ర జ్యోతి): తన పొలంలో కొలతలు వేస్తుండగా రైతు తమ్మిరెడ్డి జనార్దన్ పై పొలం విక్రయిం చిన రైతు పెమ్మారెడ్డి శ్రీనివాసులు రెడ్డి దాడికి పాల్పడ్డాడు. వివరాల మేరకు... మండలం లోని కోడూరు బిట్టు-2 నెలిమెట్ట కండ్రిగలో సర్వే నెంబ రు 18/7లో కొంత భూమిని రైతు పెమ్మారెడ్డి శ్రీనివాసు లరెడ్డి వద్ద తమ్మి రెడ్డి జనార్దన్ కొనుగోలు చేసి రిజిస్టర్ చేయించుకున్నారు. అయితే దీనికి హద్దులు చూపాలని మండల రెవెన్యూ అధికారులను కోరారు. ఈ మేరకు సంబంధిత సర్వేకి ఫీజు చెల్లించారు. దీంతో కోడూరు వీఆర్వో లక్ష్మయ్య, సచివాలయం సర్వేయర్ రాధమ్మ, ఈ పొలాన్ని రిజిస్టర్ చేసిన రైతు పెమ్మారెడ్డి శ్రీనివాసుల రెడ్డిలు బుధవారం పొలం వద్దకు చేరుకున్నారు. ఈ క్రమంలో కొలతలు వేస్తున్న సిబ్బందిని, రైతు జనార్దన్‌ను భూమి విక్రయించిన పెమ్మారెడ్డి అడ్డుకొని దాడికి ప్రయ త్నించారు. ఈ పొలాన్ని పెమ్మారెడ్డి తనకు రిజిస్టర్ చేసి, ఇప్పుడు ఆయనే అడ్డంగా మాట్లాడుతున్నాడని బాధితుడు జనార్దన్ వాపోయారు.

సెల్ఫీ పాయింట్‌తో వినోదం.. విజ్ఞానం : ఆనం

కావలి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): 'ఐ లవ్ యూ కావలి' అంటూ వందఅడుగుల ఎత్తు జాతీయ జెండాతోపాటు ఎమ్మెల్యే క్రిష్టారెడ్డి ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్ వినోదంతోపాటు విజ్ఞానం కూడా పెంపొందిస్తోందని రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. బుధవారం సాయంత్రం ఆయన కావలిలోని 100 అడుగుల జాతీయ జెండా సెల్ఫీ పాయింట్‌ను సందర్శించి, నేతలతో కలిసి కొద్దిసేపు సందడి చేశారు. సెల్ఫీ పాయింట్ వద్ద జాతీయ జెండాతోపాటు ఇప్పటివరకు పనిచేసిన కావలి ఎమ్మెల్యేల, జాతీయనేతల చిత్రాలను పరిశీలించారు.

రబీకి రెడీ

- 'రూరల్'లో కేఎస్ఎం 1638 రకానికి తొలి ప్రాధాన్యం
- రెండు, మూడు స్థానాలలో బీపీటీ, ఆర్ఎన్ఆర్
- పంటలో 10 శాతం ఎంటీయూ వైపు మొగ్గు
- దుక్కులకు సిద్ధమైన రైతన్న


విత్తనాలు చల్లుతున్న రైతు

నెల్లూరు రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : వాతావరణం అనుకూలంగా ఉండటంతో రబీ వ్యవసాయ సీజన్‌కు కర్షకులు సిద్ధమయ్యారు. ఈ నెల నుంచి సంప్రదాయ సీజన్ ఆరంభమవుతుండటంతో నెల్లూరు రూరల్‌లోని సుమారు 25 వేల ఎకరాల్లో వరి సాగుచేసేందుకు రైతులు సమాయత్తమవు తున్నారు. తొలి ప్రాధాన్యత రకంగా తమిళనాడుకు చెందిన కేఎస్ఎం 1638 వరి సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఇది సన్న రకమేకాక అధిక దిగుబడినిస్తూ చీడపీడలను తట్టుకునే శక్తి కలిగి ఉండటంతో దీనివైపు మొగ్గు చూపుతున్నారు. రెండు, మూడు ప్రాధాన్యాల్లో బీపీటీ, ఆర్ఎన్ఆర్ రకాలను సాగు చేయాలని నిర్ణయించుకున్నారు. ఎప్పుడూ లేనంతగా ఈ సారి ఎంటీయూ 1010 (లావులు) రకాన్ని కూడా సాగు చేసేందుకు రైతులు విత్తనాలను సమీకరించుకోవడం గమనార్హం. బొరుగులు, అటుకుల తయారీకి ఈ వరిని ఉపయోగిస్తుండటంతో దీనికి కూడా గిరాకీ పెరిగింది. గత సీజన్‌లోనూ పుట్టి ధర రూ.16 వేల నుంచి 17 వేలు పలికింది. ఈ క్రమంలో మండలంలోని సుమారు 10 శాతం పొలాల్లో ఈ రకాన్ని పండించనున్నట్లు అంచనా. మొత్తంగా పల్లెల్లో సేద్యం గత్తర మొదలైంది.

ఇటీవల కురిసిన వర్షాలతో వనరుల్లో నీరు పుష్కలంగా ఉండటంతో అన్నదాతలు వరి పండించేందుకు పనులు ముమ్మరం చేశారు. నెల్లూరు రూరల్ మండలంలో కనుపూరు కాలువ, సర్వేపల్లి కాలువ, లేబూరు, కోడూరు కాలువలతోపాటు చెరువుల్లోనూ నీటి నిల్వలున్నాయి. పైగా సోమశిల జలాశయంలోకి భారీగా వరద నీరు చేరడంతో సాగునీటికి ఢోకాలేదని గ్రహించిన రైతులు సాగుకు సిద్ధమయ్యారు. రూరల్‌లోని అన్నీ గ్రామాల్లో పొలాలను నారుమళ్లకు సిద్ధం చేసుకుంటున్నారు. ఎల్లుక్కిలకు స్వస్తి పలికిన అన్నదాతలు బురద దుక్కులలో నిమగ్నమయ్యారు. ట్రాక్టర్లకు డిమాండ్ పెరగడంతో విత్తనాలు చల్లుకునేందుకు కయ్యల్లో పాదులు సిద్ధం చేసుకుంటున్నారు.

పుష్కలంగా విత్తనాలు



రబీ వ్యవసాయ సీజన్‌కు విత్తనాల కోసం రైతులు ఇబ్బందులు పడాల్సిన అవసరం లేదు. అటు ప్రైవేట్ దుకాణాల్లో ఇటు ఏపీ సీడ్స్‌లోనూ పుష్కలంగా విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. ఏ రకం కావాలన్నా లభిస్తాయి. పైగా పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పంటలపై అన్నదాతలకు అవగాహన కూడా కల్పించాము.

- ఎస్వీ నాగమోహన్, నెల్లూరు రూరల్ ఏవో

సకాలంలో నీరొస్తే

పొదలకూరు మండల చెరువులను జలాశయాలతో అనుసంధానం


కాలువల ద్వారా నీటి విడుదల, వర్షపాతంపై రైతుల ఆశ

20 వేల ఎకరాల్లో వరి

పొదలకూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పొదలకూరు ప్రాంతంలో ఈ నెలలో ఆశించిన స్థాయిలో వర్షపాతం నమోదవడం, చెరువుల్లో ఇప్పటి వరకు 30 శాతం వర్షపు నీరు చేరడం, నవంబరులో కూడా అధిక వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉండడంతో రబీలో సాగునీటి ఇబ్బందులు ఉండవని రైతులు భావిస్తున్నారు. పొదలకూరు మండల పరిధిలో మొత్తం 54 చెరువులు ఉన్నాయి. దాదాపు అన్ని చెరువులకు ఏదోరకంగా సోమశిల, కండలేరు ప్రాజెక్టుల నుంచి కాలువల ద్వారా సాగునీరు అందే అవకాశం ఉంది. అధికారులు రైతులను సమన్వయ పరిచి కాలువల ద్వారా సాగునీటిని అందిస్తే మండలంలో 20వేల ఎకరాల్లో వరిసాగు చేసేందుకు వీలుంది. అమ్మవారిపాలెం, పీజీ పట్నం గ్రామ చెరువులకు మాత్రం గత ఐదేళ్ల వైసీపీ పాలనల్లో దక్షిణ కాలువ నిర్మాణం పూర్తి కాకపోవడం వల్ల చెరువుల్లోకి నీరు చేరే అవకాశం లేదు. కనుపూరు, దక్షిణ, ఎడమగట్టు, ఒకటో బ్రాంచి కాలువలు, కండలేరు ఏటి కాలువ ద్వారా చెరువులకు సాగునీరు అందుతోంది. కళ్యాణపురం పొట్టేళ్ల కాలువ చెరువు వర్షానికి నిండింది.

ఉపకాలువల ద్వారా...

సోమశిల దక్షిణ కాలువ దాని ఉపకాలువల ద్వారా మండలంలోని చెన్నారెడ్డిపల్లి, భోగసముద్రం, నావూరుపల్లి చెరువులను నింపే అవకాశం ఉంది. వీటికి కాలువ నీటితో పాటు వర్షం తోడు అయితే ఇబ్బందులు ఉండవు. ఎడమ గట్టు కాలువల ద్వారా మొత్తం 32 చెరువులకు సాగునీటిని అందించే అవకాశం ఉంది. ఇప్పటికే అందుబాటులో ఉన్న నీటితో రైతులు నార్లు పోసుకుంటే తర్వాత నాట్ల సమయంలో కాలువ ద్వారా చెరువులను నింపే అవకాశం ఉంటుందని రైతులు భావిస్తున్నారు. కనుపూరు కాలువ ద్వారా మండలంలోని తాటిపర్తి, నల్లపాలెం, వెలికంటిపాలెం, నేదురుపల్లి, ఆనాటి కండ్రిక గ్రామాలకు నీరు అందుతుంది. కండలేరు ఏటి కాలువకు సైతం ప్రాజెక్టులో లెవల్ స్లూయిజ్ ద్వారా నీటిని విడుదల చేస్తే పంటలను పండించవచ్చు. ఈ కాలువ కింద మనుబోలు మండలం వరకు రైతులు విద్యుత్ మోటార్లను ఏర్పాటు చేసుకుని నీటిని పెట్టుకుంటారు.


32 చెరువులకు నీటి అందించే కండలేరు ఎడమ గట్టు కాలువ

పాఠశాలల్లో ముందస్తు దీపావళి సంబరాలు


దీపాలు వెలిగిస్తున్న విద్యార్థులు

పొదలకూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): పొదలకూరు పట్టణంలోని నాగార్జున, విజేత, గాయత్రి తదితర పాఠశాలల్లో బుధవారం ముందస్తు దీపావళి సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు కాకరవత్తులు, చిచ్చుబుడ్లు వెలిగించి సంతోషాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమాల్లో పాఠశాల హెచ్ఎం ఎస్.లక్ష్మీదుర్గా, తదితరులు పాల్గొన్నారు.

అదానీ వరల్డ్ స్కూల్‌లో...

ముత్తుకూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): అదానీ వరల్డ్ స్కూల్‌లో బుధవారం దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు దీపాలను వెలిగించారు. విద్యార్థుల భరతనాట్యం అలరించింది. గ్రీటింగ్ కార్డులు, తోరణాల తయారీ, ఆకాశ దీపాలను వెలిగించడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ సిరియాల అకాడమిక్ హెడ్ రాబిన్, కోఆర్డినేటర్స్ వరలక్ష్మి, ఉష, దేవకీ సుమన్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తున్న విద్యార్థులకు సీఈవో అభినందన


విద్యార్థులతో సీఈవో జగదీష్ పటేల్

ముత్తుకూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): క్రీడల్లో రాణిస్తున్న కృష్ణపట్నం ఉన్నత పాఠశాల విద్యార్థులను అదానీ కృష్ణపట్నం పోర్టు సీఈవో జగదీష్‌పటేల్ అభినందించారు. జిల్లాస్థాయి క్రికెట్, వాలీబాల్, అథ్లెటిక్ పోటీలకు ఎంపికైన కృష్ణపట్నం ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయుల బృందం బుధవారం పోర్టు సీఈవోను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణపట్నం పోర్టు సామాజిక బాధ్యతలో భాగంగా అదానీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్రీడల్లోని వివిధ విభాగాల్లో శిక్షణ ఇస్తున్నామన్నారు. విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. క్రీడల్లో వివిధ విభాగాల్లో జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన వారిని అభినందించారు. అలాగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై మంచి పేరు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదానీ ఫౌండేషన్ హెడ్ రాజేష్‌రంజన్, డాక్టర్ రమేష్‌బాబు, వి.ఉమ, పీడీ అరుణకుమారి, తదితరులు పాల్గొన్నారు.

బచ్చాబాయ్‌ని కోల్పోవడం బాధాకరం


మాట్లాడుతున్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): టీడీపీ మైనార్టీ నాయకుడు బచ్చాబాయ్(సమీవుల్లా)ని కోల్పోవడం బాధాకరమని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు పేర్కొన్నారు. బుధవారం బుచ్చిలోని ఎస్ఎస్ కళ్యాణమండపంలో జరిగిన బచ్చాబాయ్ సంతాపసభలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ముందుగా చైర్‌పర్సన్ మోర్ల సుప్రజామురళి, బచ్చాబాయ్ కుటుంబ సభ్యులు, టీడీపీ నాయకులతో కలిసి బచ్చాబాయ్ చిత్రపటానికి వారు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాజకీయంగా, వ్యక్తిగతంగా ఎప్పుడు ఏ అవసరం వచ్చినా ఆయన కుటుంబ సభ్యులకు తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వీపీఆర్ ఫౌండేషన్ సహకారంతో షాదీమంజిల్ పనులు పూర్తిచేసి బచ్చాబాయ్ షాదీమంజిల్‌గా నామకరణం చేస్తామన్నారు. పందుల నిర్వాహకులను, మంగలిగట్టు నిర్వాహకులను రెచ్చగొడితే పైస్థాయిలో చెప్పి పార్టీ నుంచి సస్పెండ్ చేయిస్తానని ఘాటుగా అన్నారు. ఈ సంతాపసభలో నాయకులు ఎంపీ. శేషయ్య, హరికృష్ణ, హరనాథ్, చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, శివరామకృష్ణారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, వంశీకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నాగేశ్వరరావు కుటుంబానికి పరామర్శ

కోవూరు (ఆంధ్రజ్యోతి): ఇటీవల మృతి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు నిక్కుదల నాగేశ్వరరావు కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి బుధవారం పరామర్శించారు. నాగేశ్వరరావు పార్టీకి చేసిన సేవలు గుర్తుండిపోతాయన్నారు. ఆమె వెంట సర్పంచు యాకసిరి విజయ, టీడీపీ నాయకులు ఇంతా మల్లారెడ్డి, గాదిరాజు అశోక్‌కుమార్ తదితరులు ఉన్నారు.

'నారాయణ'లో జాతీయ రోబోటిక్ పోటీలు

నెల్లూరు(విద్య), అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం జాతీయ స్థాయి రోబోటిక్ పోటీలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ జీ శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ మద్రాస్ ఐఐటీ, ద రోబోటిక్ సొసైటీ ఆఫ్ ఇండియాతో కలిసి ఈ పోటీలు నిర్వహించామన్నారు. రోబోటిక్ ప్రాముఖ్యతను తెలియచేయడమేకాక విద్యార్థులకు దీనిపై పూర్తి అవగాహన కల్పించేందుకు ఈ పోటీలు ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు. ఈ పోటీల్లో తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఇంజనీరింగ్ విద్యార్థులు పాల్గొని వారి ప్రతిభను ప్రదర్శించారు. కార్యక్రమం లో మద్రాస్ ఐఐటీ ప్రొఫెసర్ డాక్టర్ టీ అశోకన్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ ఎస్వీ సురేష్‌బాబు, నారాయణ కళాశాల డైరెక్టర్ డాక్టర్ బీ దత్తాత్రేయశర్మ, కన్వీనర్ డాక్టర్ ఏవీఎస్ శ్రీధర్‌కుమార్, కోఆర్డినేటర్స్ యశ్వంత్, రవీంద్ర పాల్గొన్నారు.


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు

వెంకటాచలం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెముడుగుంట వద్ద కోల్‌కత్తా-చెన్నై జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు... తిరుపతి జిల్లా గూడూరుకు చెందిన ప్రవీణ్ మోటర్ బైక్‌పై నెల్లూరుకు వచ్చి తిరిగి గూడూరుకు వెళ్తూ చెముడుగుంట వద్ద ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ఘటనలో ప్రవీణ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం హైవే అంబులెన్స్‌లో నెల్లూరు ప్రభుత్వ అసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంతో రహదారిపై సుమారు అర కిలోమీటరు వరకు ట్రాఫిక్ స్తంభించింది. కొంతసేపటి తర్వాత ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బసవాయపాళెంలో టీడీపీ సభ్యత్వ నమోదు

కొడవలూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో కుంటుపడిని రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడం ముఖ్యమంత్రి చంద్రబాబుతో సాధ్య మని టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి జీవీఎన్ శేఖర్ రెడ్డి అన్నారు. మండలంలోని బసవా యపాళెంలో సర్పంచు పి.రజిని ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. టీడీపీ సభ్యత్వం కార్య కర్తకు శ్రీరామ రక్షన్నారు. అవినీతి రహిత నియోజకవర్గంగా పాలన సాగించేందుకు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు జొన్న శివకుమార్, పి.సతీష్‌రెడ్డి, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.


టీడీపీ సభ్యత్వ నమోదులో మాట్లాడుతున్న శేఖర్‌రెడ్డి

2న శివ దీక్ష ప్రారంభం

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మూలస్థానేశ్వరస్వామి ఆలయంలో నవంబరు 2వతేదీ ఉదయం 7గంటలకు శివదీక్ష మాలాధారణ జరుగుతుందని అల్లూరు గిరీష్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శివ దీక్షను స్వీకరించి ఆదిదేవుని స్మరించడం వల్ల అష్టఐశ్వర్యాలు, ఆయురారోగ్యాలు లభిస్తాయని పేర్కొన్నారు. తమ ఏఎంఆర్ గ్రూపు, ఎస్ఎస్ కన్‌స్ట్రక్షన్స్ ద్వారా శివదీక్ష చేపట్టే భక్తులకు ఉచితంగా దీక్షా వస్త్రాలు, మాలలతోపాటు ప్రతీరోజు సాయంత్రం అల్పాహారం అందిస్తామని తెలిపారు. శివదీక్ష నవంబరు 30వతేదీ వరకు ఉంటుందన్నారు.

కృష్ణ మందిరంలో కార్తీక మాసోత్సవాలు

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మహాత్మాగాంధీ నగర్‌లోని కృష్ణమందిరంలో నవంబరు 2 నుంచి 30వతేదీ వరకు కార్తీక మాసం పూజలు జరుగుతాయని మందిరం కార్యదర్శి సుబ్బరామరాజు ఓ ప్రకటనలో తెలిపారు. 2వతేదీ సాయంత్రం 6గంటలకు ఆకాశ దీపం ప్రారంభం, 4వతేదీ మొదటి సోమ వారం రాత్రి 7గంటలకు రుద్రాభిషేకం, 8వ తేదీ శ్రవణ నక్షత్రం సందర్భంగా కోటి సోమవారం వేడుకలు జరుగుతాయన్నారు భక్తులు అందరూ తరలిరావాలని కోరారు.

పాస్టర్స్ వెల్ఫేర్ సంఘం జిల్లా కమిటీ ఎంపిక

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా రమేష్ నియమితులయ్యారు. ఆ సంఘం కార్యవర్గాన్ని బుధవారం నెల్లూరు పురమందిరంలో సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గడ్డం హనోక్, రాష్ట్ర అధ్యక్షుడు బెన్‌హర్‌బాబు ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా ఏ రమేష్, ప్రధాన కార్య దర్శి ఎం జాషువా, కోశాధికారిగా ఎస్ ఎనోష్, ఉపాధ్యక్షులుగా కేఎస్ రాజు, వై సదాశివరావు మిగిలిన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. అనంతరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే విజయకుమార్ జిల్లా కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో సీజీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ డాక్టర్ ఉషాకిరణ్ రాయ్, అసోసియేషన్ నేషనల్ కన్వీనర్ జయప్రకాష్ పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

నెల్లూరు(విద్య), అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలతోపాటు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సీజీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ డాక్టర్ ఉషాకిరణ్ తెలిపారు. కొండాయపాళెం నగరపాలక ప్రాథమిక పాఠశాలలో బుధవారం నిర్వహించిన పరిశుభ్రత డ్రైవ్‌కు ఆమె అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మహేష్, హెచ్ఎం భాస్కర్‌రావు, జీఎస్టీ అధికారులు శ్రీనివాసులు, జైనేంద్ర, మార్కండేయ పాల్గొన్నారు.





గురువారం దీపావళి సందర్భంగా జిల్లాలో టపాసుల దుకాణాలు సందడిగా మారాయి. ఆయా ప్రాంతాల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన దుకాణాల్లో బుధవారం స్థానికులు టపాసులు కొనుగోలు చేశారు.

దీపావళి సందడి

అవి ఫేక్ మెయిల్స్.. ఆందోళన చెందొద్దు: ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని కొన్ని హోటళ్లు, ఆలయాలకు వచ్చిన బాంబు బెదిరింపు మెయిల్స్ ఫేక్‌వని, దీనికి ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని ఎస్పీ సుబ్బరాయుడు బుధవారం తెలిపారు. బాంబు బెదిరింపు మెయిల్స్‌పై ప్రత్యేక సైబర్ టీం, ఐటీ కోర్ సహా ఇతర విభాగాలతో దర్యాప్తు చేయిస్తున్నామన్నారు.దీనికి సంబంధించి భద్రత కూడా పెంచామన్నారు.ఏ చిన్న అనుమానం వచ్చినా, అనుమానాస్పద వస్తువులు కనపడినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బెదిరింపులు వచ్చిన అన్ని హోటళ్లు, ఇతర ప్రదేశాల్లోనూ నిరంతరం తనిఖీలు చేస్తున్నామని చెప్పారు. బెదిరింపు మెయిల్స్‌పై కేంద్ర ప్రభుత్వ నిఘా సంస్థల సహకారంతో దర్యాప్తు వేగవంతంగా చేస్తున్నామన్నారు. పటిష్ఠ పోలీసు వ్యవస్థతో తిరుపతి, తిరుమల సేఫ్ జోన్‌లో ఉన్నాయన్నారు. కాగా, ప్రశాంత వాతావరణంలో దీపావళి పండుగను జరుపుకోవాలని ప్రజలకు ఎస్పీ సుబ్బరాయుడు విజ్ఞప్తి చేశారు.

ఈ దీపావళి వెలుగులు నింపాలి

తిరుపతి(కలెక్టరేట్), ఆంధ్రజ్యోతి: ప్రజలందరి జీవితాల్లో ఈ దీపావళి వెలుగులు నింపాలని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, కలెక్టర్ వెంకటేశ్వర్, జేసీ శుభం బన్సల్ తదితరులు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అందరికీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.







రేపటి నుంచి నైపుణ్య గణన

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో శుక్రవారం నుంచి నైపుణ్య గణన సర్వే నిర్వహించనున్నట్లు జేసీ శుభం బన్సల్ బుధవారం తెలిపారు. 15-59 ఏళ్లకు సంబంధించి విద్యార్హతలు, ఉద్యోగ అనుభవం, మెరుగైన ఉద్యోగ ఆసక్తులను సేకరించి నైపుణ్యాభివృద్ధిగా తీర్చిదిద్దేందుకు ఈ సర్వే దోహదపడుతుందన్నారు. సచివాలయాన్ని యూనిట్‌గా తీసుకుని ఒక్కో క్లస్టర్‌కు ఒక ఎన్యుమరేటర్‌ను నియమించి సర్వే నిర్వహిస్తామన్నారు. దీనిని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి లోకనాథం పర్యవేక్షిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు వెంకటరమణ, సుశీలాదేవి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఉచిత గ్యాస్ సిలిండర్ పంపిణీని శుక్రవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. బుధవారం రాత్రి జిల్లాలోని అధికారులతో ఆయన కలెక్టరేట్ నుంచి టెలికాన్ఫరెన్సు ద్వారా ఈ పథకం అమలుపై దిశానిర్దేశం చేశారు. సిలిండర్ల పంపిణీలో ప్రజాప్రతినిధులను భాగస్వాములు చేసుకుని నిర్వహించాలన్నారు. జిల్లాలో 6,00,307 కార్డులు ఉన్నాయని యాక్టివ్ గ్యాస్ కనెక్షన్ కలిగి తెల్లరేషన్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ మూడు ఉచిత సిలిండర్ల పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మొదట గ్యాస్ ఏజెన్సీ వద్ద డబ్బులు చెల్లించాలని అనంతరం 48 గంటల్లో వినియోగదారుల బ్యాంకు ఖాతాలో తిరిగి జమ అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

డీఆర్వో బాధ్యతల స్వీకరణ

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా రెవెన్యూ అధికారి(డీఆర్వో)గా నరసింహులు బుధవారం కలెక్టరేట్‌లో బాధ్యతలు చేపట్టారు. అనంతరం కలెక్టర్ వెంకటేశ్వర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. తూర్పు గోదావరి జిల్లా డీఆర్వోగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ ఉన్న పెంచలకిషోర్‌ను రాష్ట్ర ప్రభుత్వం జేఏడీలో రిపోర్టు చేసుకోవాలని ఆదేశించింది. నరసింహులు మాట్లాడుతూ జిల్లాలో భూ సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. గతంలో తిరుపతి ఆర్డీవోగా పని చేశానని, ఆ అనుభవంతో అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు.




బాధ్యతలు స్వీకరిస్తున్న నరసింహులు

































నీవానదిలో ఇసుక తవ్వకాలపై ఆరా

గంగాధరనెల్లూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): నీవానది యేటిలో ఇసుకను తవ్వి తరలించడంతో ఏర్పడ్డ గుంతలను అధికారులు బుధవారం పరిశీలించారు.వైసీపీ ప్రభుత్వ హయాంలో గంగాధరనెల్లూరు మండలం కొత్రకోన , ముక్కళత్తూరు, ఎల్లాపల్లె పంచాయతీల్లోని రీచుల్లో కాంట్రాక్టర్లు ఇసుకను ఎంతలోతులో తవ్వి తరలించేశారు, దానివల్ల పర్యావరణానికి ఏ మాత్రం ముప్పువాటిల్లిందనే విషయాలను స్థానిక అధికారులతో కలిసి నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్(ఎన్జీటీ) , పొల్యూషన్ కంట్రోల్ బోర్డు(పీసీబీ) అధికారులు పరిశీలించారు. ఆర్డీవో శ్రీనివాసులు, జియాలజిస్ట్ పోలురెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు పింఛన్ల పంపిణీ

తిరుపతి(కలెక్టరేట్),అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి):నవంబరు నెలకు సంబంధించి ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్లను శుక్రవారం ఉదయం 6 గంటలకే సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నారు.691 సచివాలయాల పరిధిలోని 2,65,488మంది లబ్ధిదారులకు గాను ప్రభుత్వం రూ.112.37కోట్లు మంజూరు చేసింది.తొలి రోజు95శాతం పంపిణీ చేసేలా కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు.మిగిలినవారికి 2వతేదీ అందజేయనున్నారు.








టీటీడీ బోర్డులో ముగ్గురికి స్థానం

- చిత్తూరు, తిరుపతి జిల్లాలనుంచి చైర్మన్‌గా బీఆర్ నాయుడు, సభ్యులుగా పనబాక లక్ష్మి, వైద్యం శాంతారాం
- పండుగ పూట ఆశావహులకు తీవ్ర నిరాశ


బీఆర్ నాయుడు


పనబాక లక్ష్మి


శాంతారాం

తిరుపతి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తిరుమల-తిరుపతి దేవస్థానాలకు పాలకమండలిని రాష్ట్రప్రభుత్వం ఖరారు చేసింది. అందులో చైర్మన్ సహా ముగ్గురికి చిత్తూరు, తిరుపతి జిల్లాల నుంచీ స్థానం లభించింది. చైర్మన్‌గా టీవీ5 ఛానల్ చైర్మన్ బీఆర్ నాయుడు పేరు ఖరారు కాగా సభ్యులుగా కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి, టీడీపీ నాయీ బ్రాహ్మణ సాధికార కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు వైద్యం శాంతారామ్ ఖరారయ్యారు.వీరిలో బొల్లినేని రాజగోపాల నాయుడు అలియాస్ బీఆర్ నాయుడు చిత్తూరు జిల్లా పెనుమూరు మండలంలోని మారుమూల గ్రామమైన దిగువపూనేపల్లికి చెందిన వారు. చాలాకాలం క్రితమే ఆయన కుటుంబం హైదరాబాదులో స్థిరపడింది. ఇక సభ్యులుగా పదవి పొందిన కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి గతంలో నెల్లూరు నుంచీ మూడు సార్లు, బాపట్ల నుంచీ ఒకసారి ఎంపీగా గెలిచారు. 2004-09, 2009-14 నడుమ వైద్య, జౌళి, పెట్రోలియం శాఖలకు సహాయ మంత్రిగా పనిచేశారు. 2019లో టీడీపీలో చేరిన ఆమె ఆ ఏడాది సాధారణ ఎన్నికల్లోనూ, 2021లో జరిగిన ఉప ఎన్నికల్లోనూ తిరుపతి నుంచీ ఆ పార్టీ తరపున ఎంపీగా పోటీ చేశారు. ప్రస్తుతం తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ టీడీపీ ఇంచార్జిగా వున్నారు. ఇక వైద్యం శాంతారామ్ కుప్పం టీడీపీ ఇంచార్జి పి.ఎస్.మునిరత్నం ముఖ్య అనుచరుడు. 2003లో టీడీపీకి అనుబంధంగా నాయీ బ్రాహ్మణ సేవాసంఘాన్ని కుప్పంలో ఏర్పాటు చేశారు.టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శిగా ,నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్‌గా పనిచేసిన ఆయన ప్రస్తుతం టీడీపీ రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సాధికార కమిటీ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. **రాష్ట్రస్థాయిలో పర్యటిస్తూ నాయీ బ్రాహ్మణ సామాజిక వర్గం ఉన్నతికి కృషి చేయడమే కాకుండా, పార్టీ పటిష్ఠతకు పాటుపడ్డారు.**

కూటమి పార్టీల శ్రేణుల్లో మిశ్రమ స్పందన

కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఎప్పుడెప్పుడా అని ఆయాపార్టీ వర్గాలు ఎదురు చూసిన టీటీడీ పాలకమండలి ఎట్టకేలకు ఖరారైంది. అయితే పదవుల కేటాయింపు పట్ల మూడు పార్టీల శ్రేణుల్లో మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. ఇప్పటికే నాలుగు నెలలు గడిచిపోయిన నేపథ్యంలో ఇప్పటికైనా పాలకమండలిని ఖరారు చేయడం మంచిదేనని మెజారిటీ శ్రేణులు భావిస్తున్నాయి.అయితే పలువురు ఆశావహులు మాత్రం నిరాశకు లోనవుతున్నారు. ముఖ్యంగా దీపావళి పండుగ పూట ప్రభుత్వం టీటీడీ పాలకమండలిని ఖరారు చేయడం పదవులు పొందిన వారికి మోదం కలిగించగా అవకాశం దక్కని వారికి ఖేదం మిగిల్చింది. తిరుపతి నుంచీ టీడీపీ పార్లమెంటు కమిటీ అధ్యక్షుడు నరసింహ యాదవ్, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, టీడీపీ మీడియా కో ఆర్డినేటర్ శ్రీధర్ వర్మ, చంద్రగిరి టీడీపీ నేత హేమాంబరధర నాయుడు, జనసేన నుంచీ జిల్లా అధ్యక్షుడు పసుపులేటి హరిప్రసాద్, తిరుపతి ఇంచార్జి కిరణ్ రాయల్, బీజేపీ నుంచీ భానుప్రకాష్‌రెడ్డి తదితరుల పేర్లు టీటీడీ పాలకమండలి పదవుల కోసం ప్రముఖంగా వినిపించాయి. అయితే ఖరారైన జాబితాలో ఇందులో ఒక్క పేరు కూడా కనిపించలేదు.ఎన్టీయార్ కుటుంబాన్ని నమ్ముకోవడంతో పాటు టీడీపీలో కష్టపడి పనిచేసే నేతగా పేరున్న శ్రీధర్ వర్మ గత టీడీపీ ప్రభుత్వంలో అవకాశం తప్పిపోగా ఈ పర్యాయమైనా అవకాశం దక్కుతుందని ఆశించారు. అతనితో పాటు మిగిలిన ఆశావహులకు కూడా ప్రత్యామ్నాయంగా ఏదో ఒక పదవి దక్కే అవకాశాలు లేకపోలేదు. టీటీడీ బోర్డులోనే ప్రత్యేక ఆహ్వానితులుగా కొందరిని నియమించే అవకాశముంది. అలాగే తుడ చైర్మన్ టీటీడీ బోర్డులో ఎక్స్ అఫిషియో మెంబరుగా కొనసాగేందుకూ వీలుంది.అందులోనైనా ఛాన్సు దొరక్కపోతుందా అని ఆశావహులు తమను తాము ఊరడించుకునే ప్రయత్నం చేస్తున్నారు. ప్రత్యేక ఆహ్వానితులు, తుడా చైర్మన్‌కు ఎక్స్ అఫిషియో సభ్యత్వం, తిరుపతి ఎమ్మెల్యేకి స్పెషల్ ఇన్వైటీ హోదా లేదా ఎక్స్ అఫిషియో సభ్యత్వం వంటి అంశాలపై నెలకొన్న అస్పష్టత ప్రభుత్వ జీవో జారీతో తొలగిపోనుంది.

రోడ్డు ప్రమాదంలో హెడ్ కానిస్టేబుల్ మృతి

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు30 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్‌లో బుధవాం జరిగిన రోడ్డు ప్రమాదంలో హెడ్ కానిస్టేబుల్ లక్ష్మీనారాయణ(55) మృతి చెందారు. సీఐ చిన్నగోవిందు కథనం మేరకు.. తిరుపతి ఎల్ఎస్ నగర్‌లో నివాసం ఉంటున్న లక్ష్మీనారాయణ రేణిగుంట స్టేషన్‌లో పనిచేస్తున్నారు. పాకాలలో కోర్టు పనికి ద్విచక్ర వాహనంలో వెళ్లిన ఆయన.. తిరిగి రేణిగుంటకు బయలుదేరారు. పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారి వకులమాత ఆలయం వద్ద టమోటా ఖాళీ బాక్సులతో చెర్లోపల్లి వైపునకు వెళుతున్న వ్యాను అతివేగంగా వస్తూ బైకును ఢీకొంది. ఈ ఘటనలో లక్ష్మీనారాయణ హెల్మెట్ ఊడి కిందపడటంతో తలముందు భాగం, ఎడమకాలు తీవ్రంగా దెబ్బతిని.. కొద్ది సేపటికి అక్కడే మృతి చెందారు. వ్యాను డ్రైవర్ పరారయ్యాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు. వ్యాను డ్రైవర్ ఆపోజిట్‌లో వెళ్లడమేగాక, అతివేగం వల్లే ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు.



చెన్నైకి ఇసుక తరలిస్తున్న లారీ సీజ్

- ఎక్స్‌కవేటర్‌నూ స్టేషన్‌కు తీసుకొచ్చిన పోలీసులు


పోలీస్‌స్టేషన్‌లో ఉన్న ఎక్స్‌కవేటర్

రేణిగుంట, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): చెన్నైకి ఇసుక తరలించడానికి సిద్ధంగా ఉన్న 14 చక్రాల లారీని, ఎక్స్‌కవేటర్‌ను పోలీసులు సీజ్ చేశారు. రేణిగుంట మండలం ఎస్ఆర్‌పట్టెడ వద్ద 14 చక్రాల లారీలో ఎక్స్‌కవేటర్ సాయంతో ఇసుక నింపి చెన్నైకు తరలిస్తున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. గాజులమండ్యం సీఐ మురళీకృష్ణ, సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళుతుండగా.. ఎస్ఆర్‌పట్టెడ సమీపంలో పోలీసు వాహనాలను గమనించిన అక్రమ రవాణాదారులు పరారయ్యారు. దీంతో పట్టు కప్పి ఇసుకతో నింపిన లారీని, ఎక్స్‌కవేటర్‌ను పోలీసులు గాజులమండ్యం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బుధవారం మధ్యాహ్నం కేసు నమోదు చేశారు. తూకివాకానికి చెందిన ఓ నాయకుడు, అతడి అనుచరులు, ఎస్ఆర్‌పట్టెడకు చెందిన ఓ వ్యక్తితో కలిసి చెన్నైలోని బడా బిల్డర్ల వద్ద ఒప్పందం కుదుర్చుకుని లారీ ఇసుకను రూ.1.20లక్షలకు విక్రయిస్తున్నట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో పొరుగు రాష్ట్రాలకు ఇసుకను విక్రయించిన వారే ఇప్పుడూ కీలకపాత్ర పోషిస్తున్నారని సమాచారం. సీజ్ చేసిన లారీ, ఎక్స్‌కవేటర్‌పై కేసులు నమోదు చేయొద్దంటూ గాజులమండ్యం పోలీసులపై ఓ నాయకుడు ఒత్తిడి చేసినట్టు సమాచారం. కాగా గాజులమండ్యం పోలీసులు లారీ, ఎక్స్‌కవేటర్‌ను సీజ్ చేసినట్టు మీడియాకు తెలపకపోవడం గమనార్హం.


పట్టు కప్పి చెన్నైకి తరలిస్తున్న ట్రైలర్ లారీని సీజ్ చేసిన పోలీసులు




ఆలయం బయట.. లోపల ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలంకరణలు

శ్రీకాళహస్తీశ్వరాలయంలో రేపటి నుంచి లక్ష బిల్వ, కుంకుమార్చన

శ్రీకాళహస్తి, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసాన్ని పురస్కరించుకుని శుక్రవారం నుంచి 30వ తేదీ వరకు ముక్కంటి ఆలయంలో లక్ష బిల్వార్చన, లక్ష కుంకుమార్చన నిర్వహించనున్నట్లు ఈవో చంద్రశేఖర్ ఆజాద్ బుధవారం తెలిపారు. నెలరోజుల పాటు స్వామిఅమ్మవార్ల గర్భాలయంలో నిత్యార్చనగా ఈ క్రతువును నిర్వహించనున్నారు. కాగా, కార్తీకమాసం ప్రారంభం సందర్భంగా ఆలయంలో విద్యుద్దీపాలంకరణలు చేశారు. కార్తీకమాసంలో భక్తులకు అవసరమయ్యే ఏర్పాట్లు ఆలయ అధికారులు చేస్తున్నారు.




అధికారులతో సమీక్షిస్తున్న చిత్తూరు, తిరుపతి ఎంపీలు ప్రసాదరావు, గురుమూర్తి

అర్హులైన పేదలకు కేంద్ర పథకాలు అందించాలి

దిషా సమావేశంలో ఎంపీలు ప్రసాదరావు, గురుమూర్తి

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలకు కేంద్ర పథకాలు అందాలని, ఇందుకోసం అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని తిరుపతి జిల్లా సమన్వయ అభివృద్ధి, పర్యవేక్షణ కమిటీ(దిషా) చైర్మన్ తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి, కో చైర్మన్ చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద్‌రావు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో తిరుపతి జిల్లా సమన్వయ అభివృద్ధి, పర్యవేక్షణ కమిటీ(దిషా) సమావేశం నిర్వహించారు. గురుమూర్తి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు, అభివృద్ధి పనుల్లో ఇతర రాష్ట్రాలు, జిల్లాలతో పోటీపడాలన్నారు. లక్ష్యసాధన దిశగా అధికారులు నిబద్ధతతో పనిచేయాలని ఆదేశించారు. దగ్గుమళ్ల ప్రసాదరావు మాట్లాడుతూ కేంద్రం నుంచి 54 పథకాలు అమలవుతున్నాయని, లబ్ధిదారులకు సక్రమంగా అందుతున్నాయా లేదా సమీక్షించుకుని ముందడుగు వేయాలని సూచించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల వారికి పథకాలు సక్రమంగా అందేలా పనితీరు ఉండాలని తెలిపారు. సభ్య కార్యదర్శి, కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ పథకాలను సమన్వయంతో అమలు చేస్తామన్నారు. నెల్లూరు జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ మాట్లాడుతూ వాకాడు, నాయుడుపేట, బీఎన్‌కండ్రిగ మండలాల్లో అంగన్‌వాడీలకు సొంత భవనాలు నిర్మించాలని, ఇందుకోసం జడ్పీ నిధులు ఇస్తామని తెలిపారు.

పలు అంశాలపై సమీక్ష

జిల్లాలో అదనపు భూసార పరీక్ష కేంద్రం ఏర్పాటుకు నివేదికలు పంపుతామని, గాజులమండ్యం చక్కెర పరిశ్రమ పునఃప్రారంభానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ఎన్టీఆర్ హౌసింగ్, పీఎం ఉజ్వల యోజన, రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా చర్యలు, ఎంపీ నిధులు దుర్వినియోగం కాకుండా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. తిరుపతిలో పెండింగ్‌లో ఉన్న మల్టీలెవల్ పార్కింగ్, ఇంటిగ్రేటెడ్ మున్సిపల్ కాంప్లెక్సు తదితర ప్రాజెక్టు నిధుల కొరతపై సమీక్షించారు. సమావేశంలో తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, జేసీ శుభం బన్సల్, కమిషనర్ మౌర్య, ఎంపీపీలు పాల్గొన్నారు.



లిడ్‌క్యాప్ భూములను కాపాడుకుంటాం

- చర్మకార పరిశ్రమలు ఏర్పాటు చేస్తాం
- లిడ్‌క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు


రేణిగుంట రోడ్డులోని నారాయణాద్రి ఆస్పత్రి వెనుక లిడ్‌క్యాప్ పరిశ్రమను పరిశీలిస్తున్న చైర్మన్ మాణిక్యరావు

తిరుపతి(కలెక్టరేట్) అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అన్యాక్రాంతమైన లిడ్ క్యాప్ భూములను కాపాడుకుంటామని, సంస్థకు పూర్వవైభవం తీసుకువస్తామని లెదర్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (లిడ్‌క్యాప్) చైర్మన్ పిల్లి మాణిక్యరావు అన్నారు. తిరుపతి-రేణిగుంట మార్గంలోని నారాయణాద్రి ఆస్పత్రి సమీపంలో ఉన్న మూతబడిన లిడ్‌క్యాప్ పరిశ్రమను, భూములను ఆయన బుధవారం పరిశీలించారు. భూములు కొంతమేర అన్యాక్రాంతమైన విషయం తెలుసుకుని అసంతృప్తి వ్యక్తం చేశారు. స్థలాన్ని సర్వే చేయించి కబ్జాకు గురైతే చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ స్థలంలో పరిశ్రమలు ఏర్పాటు చేసి, చర్మకారులకు జీవనోపాధి కల్పిస్తామన్నారు. లిడ్‌క్యాప్ ద్వారా పరిశ్రమలను తీసుకురావడానికి సీఎం చంద్రబాబు విశేషంగా కృషి చేస్తున్నారన్నారు. జగన్ సీఎం అయ్యాక రాష్ట్రంలో వనరులను నిర్వీర్యం చేశారని, వ్యవస్థలను సర్వనాశనం చేశారని తెలిపారు. 1973 అక్టోబరు 4న ఏర్పాటైన లిడ్‌క్యాప్ పరిశ్రమ వైఎస్.రాజశేఖర్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి హయాంలో పూర్తిగా నిర్వీర్యం అయిపోయిందన్నారు. చంద్రబాబు పాలనలో ప్రాణం పోసుకుందని వివరించారు. ఈ కార్యక్రమంలో చర్మకారుల పరిరక్షణ సమితి నేతలు సుబ్బయ్య, రాజారావు, సుధాకర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.


ముగిసిన కల్యాణ వెంకన్న పవిత్రోత్సవాలు

చంద్రగిరి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు బుధవారం రాత్రి పూర్ణాహుతితో వైభవంగా ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం వేకువజామున స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి, తోమాల, కొలువు నిర్వహించారు. అనంతరం యాగశాలలో వైదిక కైంకర్యాలు నిర్వహించారు. అనంతరం ఉత్సవర్లకు పాలు, పెరుగు, తేనే, కొబ్బరి నీళ్ళు, పసుపు, చందనం, తదితర సుగంధ ద్రవ్యాలతో వేదమంత్రోచ్ఛారణ నడుమ శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం ఆస్థానం నిర్వహించారు. రాత్రి 7 నుండి 8 గంటల వరకు యాగశాల వైదిక కైంకర్యములు, పూర్ణాహుతి, కుంభ ప్రోక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. దీంతో పవిత్రోత్సవాలు ముగిశాయి. కార్యక్రమాలలో టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, అర్చకులు బాలాజీరంగాచార్యులు, శేషాద్రిచార్యులు, నారాయణాచార్యులు, పార్థసారథి, సూపరింటెండెంట్లు వెంకటస్వామి, రమేష్‌కుమార్, ఇన్‌స్పెకర్లు కిరణ్, ధనశేఖర్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.









అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

తడ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి చెందింది. పెళ్లకూరు మండలం పెన్నేపల్లి గ్రామానికి చెందిన కుదిరి వెంకటేశ్వర్లు, రాజమ్మ దంపతుల కుమార్తె శ్రీదేవి(27)ని తడ మండలంలోని కాదలూరు గ్రామానికి చెందిన వేలూరు సునీల్‌కు ఇచ్చి 11 ఏళ్ల క్రితం వివాహం జరిపించారు. వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. చెడు వ్యసనాలకు బానిసైన సునీల్ కొంతకాలంగా భార్యను హింసించేవాడు. బుధవారం తెల్లవారు జామున శ్రీదేవి పురుగుల మందుతాగి అపస్మారకస్థితికి చేరుకుందని ఆమె తల్లిదండ్రులకు సునీల్ ఫోన్ చేశాడు. శ్రీదేవి తల్లిదండ్రులు హుటాహుటిన కాదలూరు గ్రామానికి చేరుకోగా అప్పటికే కుమార్తె మృతి చెందింది. ఆమె మెడ, ముఖంపై గాయాలు ఉండటంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

1.90 లక్షల ఎకరాలకు తెలుగుగంగ నీరు



పునబాక తెలుగుగంగ కాలువకు జలహారతి పడుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల

పెళ్లకూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 1.90 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేసుకునేందుకు వీలుగా తెలుగుగంగ జలాలను విడుదల చేసినట్లు సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ తెలిపారు. బుధవారం తొట్టంబేడు మండలం సింగమాల వద్ద తెలుగుగంగ హెడ్ రెగ్యులేటర్ నుంచి 7వ బ్రాంచి కాలు వలకు అవసరమైన నీటిని సోమశిల నుంచి విడుదల చేయాలని మంత్రులు, ఎమ్మె ల్యేలు, ఉన్నాతాధికారులు నిర్ణయం తీసుకున్నామన్నారు. **ఇందులో భాగంగా బుధవారం నుంచి నార్లు పోసు కునేందుకు సోమశిల నుంచి రోజుకు 2900 క్యూసెక్కుల చొప్పున నవంబరు 19వ తేదీ వరకు నీటిని విడుదల చేయనున్నట్లు తెలి పారు.** అలాగే కండలేరు ప్రాజెక్టు కింద కూడా ఈదఫా పూర్తి ఆయకట్టుకు సాగునీరు అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో తెలుగుగంగ ఈఈ రాధాకృష్ణమూర్తి, డీఈ రాజ శేఖర్, గంగాధర్, ఏఈ వెంకటేష్, తహసీల్దార్ ద్వారకానాథ్‌రెడ్డి ఎంపీడీవో ప్రమీలారాణి, ఏఎంసీ మాజీ చైర్మన్ శిరసనంబేటి విజయభాస్కర్ రెడ్డి, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీకృష్ణా రెడ్డి, మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, నాయకులు పేరం రమేష్‌నాయుడు, పార్థసారధి, నాగేంద్రప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పునబాకలో విజయశ్రీ జలహారతి

మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యంతో కలసి ఎమ్మెల్యే విజయశ్రీ నీటిని విడుదల చేశారు. అనంతరం పెళ్లకూరు మండలంలోని పునబాకలో తెలుగుగంగ కాలువ వద్ద జలహారతి పట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ **సాగునీటి సలహా మండలి (ఐఏబీ) ఆలస్యమవ తుండడంతో** రబీ సీజన్ అదును దాటిపోకుండా రైతులు నారుమడులు పోసుకునేందుకు వీలుగా

కండలేరు నుంచి నీటి విడుదల



నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల

రాపూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): సైదాపురం, గూడూరు మండలాల్లో సాగునీటి అవసరాల కోసం కండలేరు జలాశయం నుంచి 50 క్యూసెక్కుల నీటిని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ బుధవారం విడుదల చేశారు. అంతకుముందు డ్యాం వద్ద ఆయన పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కండలేరు జలాలు అటు తమిళనాడు, ఇటు మూడు జిల్లాల ప్రజల సాగు, తాగునీటి అవసరాలకు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కోటి నాయుడు, రాఘవరెడ్డి, మాజీ సర్పంచు పచ్చిగల్ల రత్నం, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలేరమ్మ హుండీ లెక్కింపు

నాయుడుపేట టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గడియారం సెంటర్ వద్ద వెలసిన గ్రామదేవత పోలేరమ్మ హుండీ ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. రూ.2,36,745 నగదుతో పాటు 35 గ్రాములు బంగారు, 300 గ్రాముల వెండి వచ్చినట్లు దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో ఈవోలు రవికృష్ణ, శశాంక్ తదితరులు పాల్గొన్నారు.

డక్కిలి సర్పంచు చెక్ పవర్ రద్దు

డక్కిలి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డక్కిలి పంచాయతీ సర్పంచు వేమక్క చెక్ పవర్ రద్దు చేసినట్లు ఎంపీడీవో గుణశేఖర్‌రెడ్డి బుధవారం తెలిపారు. పంచాయతీకి చెందిన నిధులను దుర్వినియోగం చేశారని, నిబంధనలకు విరుద్ధంగా చెల్లింపులు చేపట్టారని గ్రామానికి చెందిన కొందరు ఫిర్యాదు చేశారు. విచారణ నివేదిక ఆధారంగా సర్పంచు చెక్ పవర్‌ను తాత్కాలికంగా రద్దు చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంపీడీవో వెల్లడించారు.

ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునేందుకు పటిష్ట చర్యలు

తడ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునేందుకు పటిష్ఠమైన చర్యలు తీసుకుంటున్నామని ఏఎస్పీ రవిమనోహరాచారి చెప్పారు. బుధవారం ఆయన భీములవారిపాళెం చెక్ పోస్టును తనిఖీ చేశారు. ఇసుక అక్రమ రవాణా జరగకుండా తీసుకోవాల్సిన చర్యలతో పాటు సీసీ కెమెరాల ఏర్పాటు, 24 గంటలూ తనిఖీలు నిర్వహించేలా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట డీఎస్పీ చెంచుబాబు, సీఐ మురళీకృష్ణ, ఎస్ఐ కొండపనాయుడు ఉన్నారు.

విత్తనాలు, పురుగు మందులను ఎమ్మార్పీకే విక్రయించాలి

వెంకటగిరి టౌన్, అక్టోబరు 30,(ఆంధ్రజ్యోతి): విత్తనాలు, పురుగు మందులను ఎమ్మార్పీకే విక్రయించాలని ఏడీఏ నాగర్జున సాగర్ స్పష్టం చేశారు. బుధవారం పట్టణంలోని పురుగు మందుల దుకాణాలను తనిఖీ చేశారు. రైతులు కొనుగోలు చేసిన విత్తనాలు, పురుగు మందులకు బిల్లులు ఖచ్చితంగా ఇవ్వాలన్నారు.

నిధుల దుర్వినియోగంపై డీఎల్‌పీవో విచారణ

వాకాడు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని నిడిగుర్తి పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై డీఎల్‌పీవో వెంకటరమణ బుధవారం విచారణ చేపట్టారు. 2021-2023లో గ్రామ పంచాయతీ సాధారణ నిధుల వినియోగంలో అవకతవకలు జరిగాయని టీడీపీ నాయకుడు తీపలపూడి రమణయ్య గ్రామస్తులతో కలిసి లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు దీంతో ఎంపీడీవో అన్నపూర్ణరావుతో కలిసి డీఎల్‌పీవో వెంకటరమణ విచారణ చేపట్టారు. నిడిగుర్తి పంచాయతీలో నిర్మాణంలో ఉన్న రైతు భరోసా భవనం, సిమెంటు రోడ్లను పరిశీలించి రికార్డులను తనిఖీలు చేశారు. ఆడిటింగ్ జరుగుతున్నందున పలు రికార్డులు లేకపోవడంతో మళ్లీ విచారణ చేపడుతామని ఎంపీడీవో అన్నపూర్ణరావు తెలిపారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ ఉమానాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

జింక్ లోపంతో దిగుబడిలో తగ్గుదల

దొరవారిసత్రం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): వరి సాగులో రైతులు జింక్ సల్ఫేట్ వాడకపోవడం వల్ల దిగుబడి తగ్గే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని సూళ్లూరుపేట వ్యవసాయశాఖ ఏడీఏ అనిత తెలిపారు. బుధవారం మండలంలోని సింగనాలత్తూరు, కట్టువపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. డ్రోన్‌తో కలుపు నివారణకు మందులు పిచికారి చేసే విధానంపై అవగాహన కల్పించారు.



నదుల అనుసంధానం చంద్రబాబు కల: నెలవల

పెళ్లకూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఏపీలో అన్ని నదులను అనుసంధానం చేసి రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేయాలనేది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కల అని సూళ్లూరుపేట టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. బుధవారం మండలంలోని పునబాకలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే విజయశ్రీతో కలిసి ఆయన మాట్లాడారు. గోదావరి నుంచి పెన్నా వరకు అనుసంధానం చేయడానికి 2014లోనే సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాపాడి రాజగోపాల్ రెడ్డి, రామకృష్ణ, శ్రీనివాసులు, హరి నాయుడు, యుగంధర్, సుబ్బరామయ్య, వెంపళ్ల వెంకటేశ్వర్లు, మల్లిఖార్జునరెడ్డి, కేవీ నాయుడు, మస్తాన్‌రెడ్డి, మల్లిరెడ్డి, నరేంద్ర యాదవ్, లోకేష్ నాయుడు రాకేష్‌రెడ్డి, వేణురెడ్డి, పునబాక పోలయ్య యాగాన్ని బెన్నీ, రవి నాయుడు, పరుశురాం పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త కుటుంబానికి ఆర్థికసాయం


గూడూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక 31వ వార్డులో ఇటీవల మృతిచెందిన టీడీపీ మహిళా నేత శాంతమ్మ కుటుంబ సభ్యులకు బుధవారం ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ దాతృత్వంతో రూ.5వేలు ఆర్థికసాయాన్ని టీడీపీ నాయకుడు పరిమల రాజేష్ అందజేశారు. కార్యక్రమంలో విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


గ్రావెల్ తవ్వకాల అడ్డగింత

ఓజిలి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): పశువుల మేత పరంబోకుగా వున్న తిప్పను అక్రమంగా తవ్వి తరలిస్తున్నారని మండలం లోని ఆరిమేనిపాడు గ్రామస్తులు బుధవారం గ్రామస్తులు క్వారీ వద్ద ఆందోళన చేపట్టారు. ప్రాణాలు పోయినా క్వారీ నుంచి గ్రావెల్ తరలింపు జరగనిచ్చేది లేదని స్పష్టం చేశారు. ఫోర్జరీ సంతకాలతో అనుమతులు పొంది అక్రమంగా తిప్పను తవ్వి తరలిస్తున్నారని ఆరోపించారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

60 వేల సభ్యత్వాలే లక్ష్యం: పాశం

కోట, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): గూడూరు నియోజకవర్గంలోని 60 వేల సభ్యత్వాలు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్ కుమార్ తెలిపారు. కోటలోని షాదీమంజిల్‌లో బుధవారం రాత్రి కోట, వాకాడు, చిట్టమూరు మండలాల బూత్ కమిటీ ఇన్‌చార్జిలు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, మండల పార్టీ అధ్యక్షులతో సభ్యత్వాల నమోదుపై సమీక్ష జరిగింది. సునీల్‌కుమార్ మాట్లాడుతూ కార్యకర్తలకు పార్టీ కల్పిస్తున్న రాయితీలను పల్లెల్లో ప్రతి గడపకు తెలియజేయాలన్నారు. సమావేశంలో సర్వోత్తమరెడ్డి, కిషోర్‌నాయుడు, విజయశేఖర్ రెడ్డి, జలీల్ అహ్మద్, జగన్ మోహన్‌రెడ్డి, కోటేశ్వర్‌రెడ్డి, భారతమ్మ పాల్గొన్నారు










చోరీలను నివారించండి

కోట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో విద్యుత్ మోటర్లు, స్టార్టర్లు, వైర్ల చోరీ నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్ఐ పవన్ కుమార్‌కు బీజేపీ నాయకులు బుధవారం వినతి పత్రం అందజేశారు. మూడు నెలల క్రితం అల్లంపాడులో రెండు మోటర్లు, విద్యుత్ వైర్లు, సిద్దవరంలో 7 మోటర్లు, నాలుగు స్టార్టర్లు అపహరణకు గురయ్యాయని తెలిపారు. పోలీసులు రాత్రిపూట నిఘా పెంచాలని కోరారు. కార్యక్రమంలో పనబాక కోటేశ్వరరావు, గిరిధర్‌రెడ్డి, సారంగం రమేష్‌బాబు, వాసు పాల్గొన్నారు.















టీడీపీ సభ్యత్వంతో కార్యకర్తల సంక్షేమానికి భరోసా: పాశం



సమావేశంలో ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

గూడూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వంతో కార్యకర్తల సంక్షేమానికి భరోసా లభిస్తుందని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో టీడీపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ సభ్యత్వ నమోదును అత్యధిక సంఖ్యలో చేపట్టి రాష్ట్రంలోనే నియోజకవర్గానికి గుర్తింపు తీసుకురావాలని కోరారు. ఇందుకోసం నాయకులు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, బూత్ కన్వీనర్లు ఎక్కువ సంఖ్యలో టీడీపీ సభ్యత్వాలు నమోదు చేయించేలా కృషి చేయాలన్నారు. పార్టీ సభ్యత్వం తీసుకున్న వారు ప్రమాదవశాత్తు మృతి చెందితే వారి కుటుంబ సభ్యులకు రూ.5 లక్షల బీమా అందించడం జరుగుతుందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను సీఎం చంద్రబాబు నెరవేరుస్తున్నారని, దీపావళి కానుకగా మహిళలకు ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందజేసే పథకాన్ని సీఎం ప్రారంభించనున్నారన్నారు. కార్యక్రమంలో శీలం కిరణ్ కుమార్, పులిమి శ్రీనివాసులు, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, అబ్దుల్ రహీమ్, బిల్లు చెంచు రామయ్య, మట్టం శ్రావణి, వాటంబేడు శివకుమార్, ఇజ్రాయిల్ కుమార్, సోమిశెట్టి చెంచురామయ్య పాల్గొన్నారు.

బాలుడి హత్య కేసులో నిందితుల అరెస్టు



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రమణకుమార్

చిల్లకూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని వరగలి గ్రామానికి చెందిన లాసిక్(11) హత్య చేసిన కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ రమణ కుమార్ తెలిపారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన సమావేశంలో డీఎస్పీ వివరాలు వెల్లడించారు. ఆయన కథనం మేరకు... లాసిక్ తల్లి సంధ్యతో కోట మండలం కొక్కుపాడు గ్రామానికి చెందిన అనిల్‌కు వివాహేతర సంబంధం ఉంది. తనతో కలిసి ఉండాలని అనిల్ ఒత్తిడి చేస్తుండడంతో బిడ్డ ఉన్నాడన్న కారణంతో సంధ్య నిరాకరించింది. లాసిక్‌ను అడ్డు తొలగిస్తే సంధ్యతో పాటు ఆమె పేరున ఉన్న ఆస్తి కూడా తన సొంతమవుతుందని అనిల్ భావించాడు. చిల్లకూరు మండలం వరగలి గ్రామానికి చెందిన చరణ్‌తో కలిసి లాసిక్ హత్యకు పథకం పన్నారు. ఈనెల 7వ తేదీన లాసిక్ ఇంటి వద్ద ఆడుకుంటుండగా అనిల్, చరణ్ మాయ మాటలు చెప్పి వరగలి సమీపంలోని ఉప్పుటేరు కాలువ వద్దకు తీసుకువెళ్లారు. ఈత నేర్పిస్తామని చెప్పి లాసిక్‌ను నీటిలో ముంచి చంపేశారు. సంధ్య భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. అనిల్, చరణ్‌ను నిందితులుగా గుర్తించి బుధవారం అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో సీఐ కిషోర్‌బాబు, ఎస్ఐ సురేస్‌బాబు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త హత్య కేసులో మరో ఇద్దరి అరెస్టు

చిల్లకూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాంచా రమ్మపేట గ్రామంలో ఈనెల 22వ తేదీ జరిగిన టీడీపీ కార్యకర్త హరిప్రసాద్ హత్య కేసులో చిల్లకూరు వడ్డిపాళెం ప్రాంతానికి చెందిన అచ్చి ప్రవీణ్, నాంచారమ్మపేటకు చెందిన మస్నెం బుజ్జమ్మను అరెస్టు చేసినట్లు డీఎస్పీ రమణకుమార్ బుధవారం తెలిపారు. ఇప్పటికే ఈ కేసుకు సంబంధించి 14 మందిని అరెస్టు చేయగా, బుధవారం మరో ఇద్దరి అరెస్టు చేశామని చెప్పారు.

ఏపీవోతో ఉపాధి కూలీల వాగ్వాదం

పది మందిపై కేసు నమోదు

కోట, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఉపాధి పనుల విషయమై ఏపీవోతో కూలీలు వాగ్వాదానికి దిగడంతో పది మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మండల పరిధిలోని కొత్తపట్నం పంచాయతీలోని వావిళ్లదొరువు, కొత్తపట్నం గ్రామాల సమీపంలో నాగులతోట తోనకాలువ పూడికతీత పనులు రెండు రోజుల క్రితం జరిగాయి. కాలువలో నీళ్లు ఉండటంతో పనులు ఆపేయాలని ఏపీవో పూర్ణిమ ఆదేశాల మేరకు క్షేత్ర సహాయకుల సూచనతో కూలీలు పనులు నిలిపివేశారు. బుధవారం కొత్తపట్నం పంచాయతీలోని పలు గ్రామాలకు చెందిన మహిళలు, పురుషులు మండల పరిషత్ కార్యాలయానికి చేరుకున్నారు. ఎంపీడీవో వేణును కలిసి ఏపీవో పూర్ణిమ తమపట్ల వివక్షత చూపుతున్నారని, పనులు చేసినప్పటికీ వేతనాలు చెల్లించడం లేదని, టీడీపీ నాయకులకు తొత్తుగా వ్యవహరిస్తున్నారని ఫిర్యాదు చేశారు. ఎంపీడీవో వెంటనే ఏపీవోను పిలిపించి మాట్లాడుతుండగానే ఆమెతో మహిళలు వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో తోపులాట జరిగడంతో ఎంపీడీవో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంతలో ఏపీవో డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేస్తూ కూలీలు వెళ్లిపోయారు. ఎస్ఐ పవన్‌కుమార్ మండల కార్యాలయానికి చేరుకొని ఏపీవో పూర్ణిమ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పది మందిపై కేసులు నమోదు చేశారు. ఇదిలా ఉండగా ఏపీవోతో వాగ్వాదానికి దిగిన మహిళలు వైసీపీ నేత, మాజీ జడ్పీటీసీ ప్రసాద్‌గౌడ్‌ను వెంటబెట్టుకుని పోలీసు స్టేషన్‌కు చేరుకున్నారు. ఏపీవోపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఫిర్యాదు చేశారు.

గోకులాలకు భూమిపూజ

కోట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గూడలిలో టీడీపీ మండల ఉపాధ్యక్షుడు వెంకటకృష్ణారెడ్డి, చంద్రశేఖరపురంలో మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు మస్తాన్‌బాషా, పశువైద్యాధికారి రాజేష్ మినీ గోకులాల నిర్మాణానికి భూమిపూజ చేశారు.

ప్రశాంతిరెడ్డి నియామకం పట్ల హర్షం

నాయుడుపేట, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యురాలుగా కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి నియామకం పట్ల టీడీపీ నాయకులు కట్టా వెంకటరమణారెడ్డి, ఆయన సతీమణి సురేఖరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఇటీవల కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ కన్సల్టెన్సీ కమిటీలో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డికి స్థానం లభించగా.. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన టీటీడీ బోర్డులో వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి స్థానం దక్కడంపై కట్టా దంపతులు అభినందనలు తెలిపారు.

ప్రభుత్వ భూములను కాపాడండి

బాలాయపల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ భూములను కాపాడాలని మన్నూరు గ్రామానికి చెందిన జడపల్లి కోటీశ్వరరావు తహసీల్దార్ శ్రీనివాసులకు వినతిపత్రం అందించారు. తమ గ్రామంలోని కొందరు ప్రభుత్వ భూములను అమ్మేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ భూములను కాపాడి, గ్రామంలో ఉన్న పేదలకు పంచాలని కోటీశ్వరరావు వినతిపత్రంలో కోరారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

గూడూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలోని ఫీజు బకాయిలను చెల్లించాలన్నారు. అలాగే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు పరచాలన్నారు. సంక్షేమ వసతి గృహాల్లో వసతులు మెరుగు పరచి మెస్ చార్జీలను పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనాకు వినతిపత్రం అందజేశారు.

రక్తదానంతో ప్రాణదానం

గూడూరు అర్బన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): రక్తదానం ప్రాణదానంతో సమానమని డీఎస్పీ రమణ కుమార్ అన్నారు. బుధవారం స్థానిక ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో పోలీసుశాఖ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాలు జరిగి ప్రాణాపాయస్థితిలో ఉన్న వారికి రక్త కొరత తీర్చేందుకు ప్రతి ఒక్కరూ రక్తదాతలుగా మారాలన్నారు. కార్యక్రమంలో సీఐలు శేఖర్‌బాబు, కిషోర్‌బాబు, శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మైనింగ్‌లో అవినీతిని అరికట్టేందుకు చర్యలు

గూడూరు అర్బన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం భూగర్భ, గనులశాఖలో అడ్డగోలు ఉల్లంఘనలకు తెరతీయగా... ప్రస్తుత కూటమి ప్రభుత్వం దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించింది. సిలికా సాండ్ క్వారీలు, క్వార్ట్జ్‌గనులు, మైనింగ్ యార్డులలో పారదర్శక చర్యలను ప్రారంభిస్తూ, ఖనిజాల రవాణా కోసం పర్మిట్లను మంజూరు చేసేందుకు ప్రత్యేక బృందం బుధవారం చిల్లకూరు మండలంలోని రామారెడ్డిపాళెం, తిక్కవరం, కడివేడు ప్రాంతాల్లో పరిశీలన చేపట్టింది. గూడూరు డివిజనల్ భూగర్భ గనులశాఖ అధికారి కే.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఇద్దరు రాయల్టీ ఇన్స్‌పెక్టర్లు, మరో ఇద్దరు టెక్నికల్ అసిస్టెంట్లు యార్డులలో నిల్వలు, అక్కడ నిఘా కెమెరాలు, భౌగోళిక అక్షాంశాల(జీయోగ్రాఫికల్ కోఆర్డినేట్స్) ఏర్పాట్లను పరిశీలించారు. మినరల్ డీలర్స్ లైసెన్స్‌దారులకు, సిలికా సాండ్ లీజుదారులకు ఈ బృందం తగు సూచనలు చేస్తూ, గీత దాటితే వేటు తప్పదని హెచ్చరించింది. రికార్డులో పొందుపరిచిన ముగింపు నిల్వలను, ప్రస్తుత నిల్వలను లెక్కకట్టారు. గురువారం సెలవుదినం కావడంతో శుక్రవారం నుంచి తిరిగి చిల్లకూరు, కోట, గూడూరు మండలాల్లో పర్యవేక్షణ కొనసాగించనున్నారు. నివేదికల ప్రకారం త్వరలో మైనింగ్ పర్మిట్లును మంజూరు చేయనున్నారు.

పేల్చితే ఆనందం.. పేలితే ప్రమాదం!

● బాణసంచా కాల్చేటప్పుడు జాగ్రత్త సుమా!

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : దీపావళి వచ్చిందంటే చాలు పెద్దలు, పిల్లలకు భలే సరదా. వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ బాణసంచా కాల్చుతారు. తమ ఇంట్లో చీకటిని పారద్రోలి దివ్య వెలుగులు వెలగాలని కోరుకుంటూ ఇంటి వాకిళ్లలో కొవ్వొత్తులు, ప్రమిదలు వెలిగించుకుంటారు. పురుషులు పెద్ద శబ్దాలు వచ్చే టపాకాయలు కాల్చుతుంటే, మహిళలు, పిల్లలు రంగురంగుల పూలు విరజిల్లే కాకర ఒత్తులు, సురసురాలు, భూచక్రాలు, వెన్నముద్దలు, జడలు కాలుస్తుంటారు. అయితే టపాకాయలు కాల్చే సమయంలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా, మొరటుగా వ్యవహరించినా ప్రమాదాల బారిన పడే ముప్పు ఉంది.



● రసాయనాలు వాడకం..

ప్రస్తుతం తయారు చేస్తున్న టపాసులలో రసాయనాలు సైతం ఎక్కువగా వాడుతున్నారు. దీనివల్ల ఆరోగ్యంతోపాటు పర్యావరణానికి తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది. ఈ టపాసుల్లో పొటాషియం నైట్రేట్, పొటాషియం క్లోరైట్స్, పోటాషియం పర్ క్లోరేట్స్, చార్‌కోల్, సల్ఫర్, మ్యాంగనీస్, సోడియం ఆక్సలేట్స్, అల్యూమీనియం, ఐరన్ డస్ట్ పౌడర్, స్ట్రాన్షియం నైట్రేట్, బేరియం నైట్రేట్ తదితర వెలుగులు విరజిమ్మే రసాయనాలు ఎక్కువగా ఉంటున్నాయి. రాకెట్లు, చిచ్చుబుడ్లు పేల్చినప్పుడు అందులోని పాలిక్లోరినేటెడ్ డై ఆక్సిన్స్, ఫూరాన్స్‌తోపాటు అనేక రకాల విష పదార్థాలు వాతావరణంలో కలుస్తాయి. వీటితోపాటు ఓజోన్ పొరను దెబ్బ తీసే నైట్రోజన్ డై ఆక్సైడ్, సల్ఫర్ డై ఆక్సైడ్ విడుదలవుతాయి. అలాగే భార లోహాలైన లెడ్, ఐరన్, జింకు, కాపర్, మ్యాంగనీస్, కోబాల్ట్, నికెల్, క్రోమియం, కాడ్మియంలు వాతావరణంలో కలుస్తాయి. శబ్ధ, నీటి, నేల కాలుష్యం ఎక్కువగా ఉంటుంది. ఇది మనిషి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతాయి.


బాణసంచా కొనుగోలు చేస్తున్న నగరవాసులు

ఈ వ్యాధులు సంక్రమిస్తాయి

● కళ్లు మంటలు, ఊపిరితిత్తుల్లో నెమ్ము ● గొంతు వాపు, జలుబు, తల నొప్పి, చాతి బరువెక్కడం ● శ్వాసకోశ ఇబ్బందులు ● టపాసుల పొగ పీల్చిన పది, పదిహేను నిమిషాలలో సల్ఫర్ డై ఆక్సైడ్ ప్రభావం చూపుతుంది. ● మానసిక, నరాల సమస్యలు ● రక్త సంబంధిత వ్యాధులు ● గుండె జబ్బులు, కేన్సర్ కారక వ్యాధులు ● నిద్రలేమి, వినికిడి శక్తి తగ్గిపోవడం, హై బీపీ

ఈ జాగ్రత్తలు తీసుకోండి

- టపాసులు కాల్చేటప్పుడు శరీరానికి బిగుతుగా ఉండే దుస్తులతోపాటు, శిల్క్ దుస్తులు ధరించరాదు. కాటన్ దుస్తులు మాత్రమే ధరించాలి.
- పేలుడు పదార్థాలు కాల్చేటప్పుడు చిన్నారుల వద్దనే పెద్దలు ఉండాలి.
- సగం పేలిన టపాకాయల వద్దకు వెళ్లకూడదు, కొంత సమయం గడిచిన తరువాత వాటిని నీటిలో వేయడం లేదా ఇసుకతో కప్పి వేయాలి.
- ఇరుకుగా ఉండే నివాసాలు, పూరిగుడిసెల మధ్య టపాసులను పేల్చడం మంచిది కాదు.
- టపాకాయలు కాల్చేటప్పుడు నీరు, ఇసుకను దగ్గరగా ఉంచుకోవాలి.
- తారజువ్వలను నిలువుగా ఉంచి కాల్చాలి.
- చేతులతో పట్టుకుని టపాసులు కాల్చరాదు.
- ఇళ్లలో టపాసులను పిల్లలకు అందకుండా ఉంచాలి.
- పెట్రోలు బంకులు దగ్గరగా ఉన్నచోట టపాసులు కాల్చరాదు.
- టపాసుల ఒత్తులు కాలి సగానికి నిలిచినప్పుడు దగ్గరగా వెళ్లి ఊదడం వంటివి చేయరాదు.
- టపాసులను కాల్చేటప్పుడు మిగిలిన టపాసులను దగ్గరగా ఉంచుకోరాదు. ఎందుకంటే నిప్పురవ్వలు పడి అవి కూడా పేలే అవకాశం ఉంటుంది కాబట్టి.
- టపాసులకు సాంబ్రాణి కడ్డీలతో అంటించడం ఎంతో మేలు.
- టపాసులు కాల్చేటప్పుడు మూతికి గుడ్డ కట్టుకోవాలి.

నాటు మందు మిస్‌ఫైర్

- ముగ్గురికి తీవ్ర గాయాలు
- బాధితుల్లో ఒకరు నెల్లూరు వాసి
- కృత్తివెన్ను మండలం నిడమర్రులో ఘటన


సంఘటనలో తీవ్రగాయాలపాలైన శివ

కృత్తివెన్ను, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): నాటు మందు మిస్‌ఫైర్ అవ్వడంతో ముగ్గురు గాయపడిన ఘటన కృత్తివెన్ను మండలం నిడమర్రు దళితవాడలో బుధవారం జరిగింది. వివరాల్లోకి వెళితే... నెల్లూరు పట్టణానికి చెందిన శివ పిట్టలు కొట్టుకుంటూ జీవిస్తున్నాడు. చెరువుల వద్ద పిట్టలు కొట్టేందుకు నిడమర్రు వచ్చాడు. గ్రామానికి చెందిన కర్రి నాగమల్లేశ్వరరావు సాయంతో నడకుదిటి వెంకన్న ఇంటి వద్ద పిట్టలను కాల్చే మందును సిద్ధం చేసేపనిలో నిమగ్నమయ్యారు. పక్క ఇంట్లో ఉండే 3వ తరగతి విద్యార్థి కర్రి తేజ వీరు చేసే పని చూసేందుకు వెళ్లాడు. ఇంతలో వర్షం పడటంతో హడావుడిగా మందును ఇంట్లోకి తీసుకెళ్తుండగా, ప్రమాదవశాత్తు మందు ఉన్న గిన్నె రాయిపై పడి, మిస్ ఫైర్ అయ్యింది. దీంతో శివ, నాగమల్లేశ్వరరావు కాళ్లకు తీవ్ర గాయాలు అయ్యాయి. తేజ కూడా గాయపడ్డాడు. వీరిని మచిలీపట్నం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. శివ, నాగమల్లేశ్వరరావు పరిస్థితి విషమంగా ఉంది. ఘటనా స్థలాన్ని డీఎస్పీ అబ్దుల్ సుభాన్, తహసీల్దార్ సోమేశ్వరరావు, ఎస్సై పైడిబాబు పరిశీలించారు. క్లూస్ టీమ్‌లు పరిశీలించి వివరాలను సేకరించాయి.

నాటు బాంబు!

జరిగిన ప్రమాదంపై భిన్న కథనాలు వినిపిస్తున్నాయి. నాటు బాంబుల తయారీలో అజాగ్రత్త వల్లే ప్రమాదం జరిగినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. తెల్లారితే దీపావళి.. పందుల వేట కోసం రహస్యంగా నాటు బాంబులు తయారీ జరుగుతున్నట్లు స్థానికులు చెప్పుకుంటున్నారు. తయారు చేసిన మందులను ఇంట్లో భద్రపరిచే క్రమంలో ప్రమాదం జరిగినట్లు వస్తున్న పుకార్లకు, సంఘటనలో సంభవించిన తీవ్రత, క్షతగాత్రులకు అయిన గాయాలు మరింత బలం చేకూర్చుతున్నాయి. అయితే పోలీసులు మాత్రం దీపావళి మందులు తరలించే క్రమంలో ప్రమాదం జరిగిందని చెబుతున్నారు.

పెరుగుతున్న పొగాకు సాగు

విస్తీర్ణం పెంచవద్దంటున్న బోర్డు అధికారులు ● ప్రత్యామ్నాయ పంటల సాగుకు సూచన

కలిగిరి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకుబోర్డు పరిధిలో ఏటేటా పొగాకు సాగు పెరుగుతోంది. ఓ బ్యారన్‌కు సరపడా పంటను సాగుచేస్తే పెట్టుబడులు పోను గతేడాది రూ. ఐదు లక్షలపైగా ఆదాయం వచ్చింది. దీంతో ఈ ఏడాది సాగుకు అధికసంఖ్యలో రైతులు ముందుకు వస్తున్నారు. ఈ క్రమంలో పొగాకు సాగును తగ్గించి ప్రత్యామ్నాయ పంటలైన కంది, పెసర, శనగ తదితరాలను సాగుచేయాలని బోర్డు అధికారులు రైతులకు సూచిస్తున్నారు. అయితే పొగాకు సాగుకు అలవాటి పడిన రైతులు ప్రత్యామ్నాయ పంటలవైపు మొగ్గు చూపడానికి సుముఖత వ్యక్తం చేయడం లేదు. కరోనా అనంతరం పొగాకు సాగును ప్రపంచవ్యాప్తంగా పలుదేశాల్లో తగ్గించడంతో భారత్‌లో పొగాకు మార్కెట్‌కు డిమాండ్ ఏర్పడింది. కానీ ఈ ఏడాది బ్రెజిల్, టాంజానియా, జింబాంబ్వే తదితర దేశాల్లో తిరిగి పొగాకు సాగు మొదలు పెట్టారు. ఆయా దేశాల్లో పండిన పొగాకు అధిక నాణ్యతా ప్రమాణాలు కలిగి ఉండటంతో ఎక్కువ శాతం ఆయా దేశాల పొగాకుకే డిమాండ్ ఉంది. ఆ ప్రభావం భారత్ మార్కెట్‌పై పడుతుందని, తద్వారా ధరలు తగ్గే అవకాశముందని అధికారులు తెలిపారు. ఈ విషయాలన్నీ దృష్టిలో పెట్టుకొని పొగాకు సాగును తగ్గించాలని వారు పేర్కొన్నారు.


కలిగిరి పొగాకు బోర్డు పరిధిలో సాగు చేస్తున్న పొగాకు

పండుగను ప్రశాంతంగా జరుపుకోండి

● ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు క్రైం, (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజలకు, పోలీసు అధికారులు, సిబ్బందికి ఎస్పీ జీ కృష్ణకాంత్ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఈ పండుగ అందరి జీవితాల్లో కాంతులు నింపాలని ఆకాంక్షిస్తున్నానన్నారు. ముందు జాగ్రత్త చర్యలతో, ప్రశాంత వాతావరణంలో దీపావళి జరుపుకోవాలని, పిల్లలు బాణసంచా కాల్చేప్పుడు తల్లిదండ్రులు మరింత అప్రమత్తంగా ఉండాలని కోరారు. లైసెన్స్ కలిగిన దుకాణదారులు మాత్రమే బాణాసంచా విక్రయాలు చేయాలని, నిబంధనలకు విరుద్ధంగా టపాసులు నిల్వ ఉంచినా, విక్రయించినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

యూపీఐ పాలిమర్స్ పైపుల తయారీ ఫ్యాక్టరీలో చోరీ

- రూ.30 లక్షల విలువైన మిషనరీ పరికరాల మాయం
- గతంలోనూ రెండుసార్లు చోరీకి యత్నం

వెంకటాచలం, అక్టో బరు 30(ఆంధ్రజ్యోతి) : మండలంలోని సర్వేపల్లి సమీపంలో ఉన్న యూపీఐ పాలిమర్స్ పైపుల తయారీ ఫ్యాక్ట రీలో మంగళవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. గుర్తుతెలియని వ్యక్తులు మొహాలకు గుడ్డలు కట్టు కొని అర్ధరాత్రి ఫ్యాక్టరీలోకి ప్రవేశించి దాదాపు రూ.30లక్షల విలువ చేసే మిషనరీ పరికరాలను అపహరించుకెళ్లారు. ఈ దృశ్యాలు అన్ని ఫ్యాక్టరీలో ఉన్న సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి. అయితే గత రెండు నెలల వ్యవధిలో రెండు సార్లు ఇదే ఫ్యాక్టరీలోకి గుర్తుతెలియని వ్యక్తులు ప్రవేశించి చోరీకి యత్నించారు. దీనిపై గతంలోనే ఫ్యాక్టరీ యాజమాన్యం వెంకటాచలం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కానీ ఆ సమయంలో పోలీసులు పట్టించుకోలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గత రెండేళ్ల కిందట కూడా ఫ్యాక్టరీలో చోరీ జరగగా అప్పట్లోనే దొంగలు పట్టుబడ్డారు. అయితే మంగళవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు మొహాలకు గుడ్డలు కట్టుకొని ఫ్యాక్టరీలోకి ప్రవేశించి చోరీకి పాల్పడ్డారు. దీంతో ఫ్యాక్టరీ యాజమాన్యం బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ సుబ్బారావు, ఎస్‌ఐ అంజనేయులు ఫ్యాక్టరీ వద్దకు చేరుకొని చోరీ జరిగిన తీరు, సీసీ కెమెరాలను క్షుణ్ణంగా పరిశిలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కుష్ఠను ప్రారంభంలో గుర్తిస్తే వైకల్యం రాదు

● అదనపు జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వలి

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : కుష్ఠువ్యాధిని మొదటి దశలోనే గుర్తిస్తే అంగవైకల్యాన్ని అరికట్టవచ్చని వైద్య ఆరోగ్య శాఖ అదనపు జిల్లా అధికారి డాక్టర్ ఖాదర్‌వలి వెల్లడించారు. వైద్య ఆరోగ్యశాఖ కార్యాల యంలో బుధవారం డిప్యూటీ పారామెడికల్ అధికారులతో సమీక్ష జరిపారు. ప్రస్తుతం కుష్ఠువ్యాధి నివారణకు ఎన్నో రకాల మందులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. వైద్యాధికారి డాక్టర్ సురేంద్ర మాట్లాడుతూ కుష్ఠు వ్యాధిగ్రస్తుల వివరాలు ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందుబాటులో ఉండాలని సూ చించారు. వైద్యాధికారి డాక్టర్ సునీత్ మాట్లాడుతూ కుష్ఠువ్యాధి స్పర్శ లేని రాగి రంగు మచ్చలతో వస్తుందని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో డీపీఎంవోలు, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్డీవో కార్యాలయ ఉద్యోగిపై వేటు

- బాణసంచా దుకాణాల లైసెన్సులపై ఆరోపణలు
- సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు

నెల్లూరు (వెంకటేశ్వరపురం), అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు ఆర్డీవో కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న జూనియర్ అసిస్టెంట్ శ్రావణ్ కుమార్‌ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఆనంద్ బుధవారం ఉత్తర్వులు ఇచ్చారు. టపాసుల దుకాణాల లైసెన్సుల రెన్యువల్‌లో జాప్యంతోపాటు దుకాణాలను కేటాయించే డిప్‌లో సైతం గందరగోళ పరిస్థితులు నెలకొనడంపై ఈ చర్యలు తీసుకొన్నట్లు ఆర్డీవో అనూష తెలిపారు. వీటితోపాటు పలు ఆరోపణలు రావడంతో సస్పెండ్ చేసినట్లు పేర్కొన్నారు.

ఈశా ఫౌండేషన్ గ్రామోత్సవాలు

● జిల్లాలో క్రీడల నిర్వహణకు ఏర్పాట్లు


వివరాలు వెల్లడిస్తున్న ఈశా ఫౌండేషన్ సభ్యులు

నెల్లూరు(విద్య), అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఈశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లాలో గ్రామోత్సవాలు నిర్వహిస్తున్నామని ఫౌండేషన్ ప్రతినిధి బ్రహ్మానాయుడు తెలిపారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రామీణ స్ఫూర్తిని పునరుజ్జీవింప చేసేందుకు, పల్లె ప్రజల్లో ఉత్సాహం నింపేందుకు గ్రామోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. దీనిలో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు ఈనెల 16, 17 తేదీల్లో నెల్లూరులోని దర్గామిట్ట జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో క్రీడాపోటీలు జరుపుతామని చెప్పారు. పంచాయతీల నుంచి ఎన్ని జట్లు అయినా ఈ పోటీల్లో పాల్గొనవచ్చని, విజేతలకు నగదు బహు మతులు, ప్రసంశాపత్రాలు అందచేస్తామన్నారు. జిల్లాస్థాయిలో గెలుపొందిన జట్లు రాష్ట్రస్థాయిలో, రాష్ట్రస్థాయిలో గెలుపొందిన వారు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు. ఆసక్తి కలిగిన వారు నవంబరు 10లోపు వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ఈశా ఫౌండేషన్ వలంటీర్లు గణేష్, ఆయేషా, మాధవ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

బచ్చాబాయ్‌ని కోల్పోవడం బాధాకరం


మాట్లాడుతున్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): టీడీపీ మైనార్టీ నాయ కుడు బచ్చాబాయ్(సమీవుల్లా)ని కోల్పోవడం బాధాకరమని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి దంపతులు పేర్కొ న్నారు. బుధ వా రం బుచ్చిలోని ఎస్‌ఎస్ కళ్యాణమండపంలో జరిగిన బచ్చాబాయ్ సంతాపసభలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ముందుగా చైర్‌పర్సన్ మోర్ల సుప్రజామురళి, బచ్చాబాయ్ కుటుంబ సభ్యులు, టీడీపీ నాయకులతో కలిసి బచ్చాబాయ్ చిత్రపటానికి వారు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాజకీయంగా, వ్యక్తిగతంగా ఎప్పుడు ఏ అవసరం వచ్చినా ఆయన కుటుంబ సభ్యులకు తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వీపీఆర్ ఫౌండేషన్ సహకారంతో షాదీమంజిల్ పనులు పూర్తిచేసి బచ్చాబాయ్ షాదీమంజిల్‌గా నామకరణం చేస్తామన్నారు. పందుల నిర్వాహకులను, మంగలిగట్టు నిర్వాహకులను రెచ్చగొడితే పైస్థాయిలో చెప్పి పార్టీ నుంచి సస్పెండ్ చేయిస్తానని ఘాటుగా అన్నారు. ఈ సంతాపసభలో నాయకులు ఎంవీ. శేషయ్య, హరికృష్ణ, హరనాథ్, చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, శివరామకృష్ణారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, వంశీకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నాగేశ్వరరావు కుటుంబానికి పరామర్శ

కోవూరు (ఆంధ్రజ్యోతి): ఇటీవల మృతి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు నిక్కుదల నాగేశ్వరరావు కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి బుధవారం పరామర్శించారు. నాగేశ్వరరావు పార్టీకి చేసిన సేవలు గుర్తుండిపోతాయన్నారు. ఆమె వెంట సర్పంచు యాకసిరి విజయ, టీడీపీ నాయకులు ఇంతా మల్లారెడ్డి, గాదిరాజు అశోక్‌కుమార్ తదితరులు ఉన్నారు.

పాఠశాలల్లో ముందస్తు దీపావళి సంబరాలు


దీపాలు వెలిగిస్తున్న విద్యార్థులు

పొదలకూరు, అక్టోబరు 30(ఆంధ్ర జ్యోతి): పొ దలకూరు పట్టణంలోని నాగార్జున, విజేత, గా యత్రి తదితర పాఠశాలల్లో బుధవారం ముంద స్తు దీపావళి సంబరాలు ఘనంగా నిర్వ హించారు. విద్యార్థులు కాకరవత్తు లు, చిచ్చుబుడ్లు వెలిగించి సంతో షాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్ర మాల్లో పాఠశాల హెచ్‌ఎం ఎస్.లక్ష్మీ దుర్గా, తదితరులు పాల్గొన్నారు.

● ముత్తుకూర (ఆంధ్రజ్యోతి): అదానీ వరల్డ్ స్కూల్‌లో బుధవారం దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు దీపాలను వెలిగించారు. విద్యార్థుల భరతనాట్యం అలరించింది. గ్రీటింగ్ కార్డులు, తోరణాల తయారీ, ఆకాశ దీపాలను వెలిగించడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు.

పాస్టర్స్ వెల్ఫేర్ సంఘం జిల్లా కమిటీ ఎంపిక

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియే షన్ జిల్లా అధ్యక్షు డిగా రమేష్ నియమితు లయ్యారు. ఆ సంఘం కార్యవర్గాన్ని బుధవా రం నెల్లూరు పురమందిరంలో సంఘం వ్య వస్థాపక అధ్యక్షుడు గడ్డం హనో క్, రాష్ట్ర అధ్యక్షుడు బెన్‌హర్‌బాబు ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా ఏ రమేష్, ప్రధాన కార్య దర్శి ఎం జాషువా, కోశాధికారిగా ఎస్ ఎనోష్, ఉపాధ్యక్షులుగా కేఎస్ రాజు, వై సదాశి వరావు మిగిలిన కార్యవర్గాన్ని ఎంపిక చేశా రు. అనంతరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే విజయకుమార్ జిల్లా కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు.

క్రీడల్లో రాణిస్తున్న విద్యార్థులకు అభినందన



విద్యార్థులతో సీఈవో జగదీష్ పటేల్

ముత్తుకూరు, అక్టోబరు 30(ఆంధ్ర జ్యోతి): క్రీడల్లో రాణిస్తున్న కృష్ణప ట్నం ఉన్నత పాఠశాల విద్యార్థులను అదానీ కృష్ణపట్నం పోర్టు సీఈవో జగదీష్‌పటేల్ అభినందించారు. జిల్లా స్థాయి క్రికెట్, వాలీబాల్, అథ్లెటిక్ పోటీలకు ఎంపికైన కృష్ణపట్నం ఉన్న త పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యా యుల బృందం బుధవారం పోర్టు సీఈవోను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణపట్నం పోర్టు సామాజిక బా ధ్యతలో భాగంగా అదానీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్రీడల్లోని వివిధ విభాగాల్లో శిక్షణ ఇస్తున్నామన్నారు.

ఈ కార్యక్రమంలో ఆదానీ ఫౌండేషన్ హెడ్ రాజేష్‌రంజన్, డాక్టర్ రమేష్‌బాబు, వి.ఉమ, పీడీ అరుణకుమారి, తదితరులు పాల్గొన్నారు.

బసవాయపాళెంలో టీడీపీ సభ్యత్వ నమోదు

కొడవలూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో కుంటుపడిని రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడం ముఖ్యమంత్రి చంద్రబాబుతో సాధ్య మని టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి జీవీఎన్ శేఖర్ రెడ్డి అన్నారు. మండలంలోని బసవాయపాళెంలో సర్పంచు పి.రజిని ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. టీడీపీ సభ్యత్వం కార్య కర్తకు శ్రీరామరక్షన్నారు.